




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

ఆదివారం | 21 జూలై 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 232

| పేజీలు 10+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, అషాఢమాసం శుద్ధ పౌర్ణమి సా.4.15, ఉత్తరాషాఢ రా.1.58, వర్జ్యం ఉ.10.22 నుంచి 11.56 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం ఉ.4.50 నుంచి 5.42 వరకు

## తెలుగు రాష్ట్రాలకు
# రెయిన్ అలర్ట్
### అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు



వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయు గుండం ఒడిశాలోని చిలికా సరస్సుకు సమీపంలో కేంద్రీకృ్రాఎతమై ఉందన్నారు. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీ తీరానికి నైరుతి దిశగా 40 కిలోమీటర్లు, గోపాల్ పూర్‌కు ఈశాన్యంగా 70 కి.మీల దూరంలో కేంద్రీకృ్రా ఎతమై ఉన్నట్లు చెప్పారు.

- మరో 2 రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడి
- కృష్ణానది క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు
- అన్ని ప్రాజెక్టులు దాటుకుని శ్రీశైలంకు చేరుతున్న వరద నీరు
- ఏపీ, ఒడిశా మధ్య నిలిచిన రాకపోకలు



ప్రాజెక్టులు నిండితే నీటికి ఇబ్బంది లేనట్లే తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జున సాగర్, ఈ రెండు ప్రాజెక్టులు సీజన్‌లో నిండితే.. ఆ ఏడాది నీటికి కరువు ఉండదు. గత ఏడాది రెండు ప్రాజెక్టులు నిండకపోవడం.. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పుడు వరద ప్రారంభంకావడంతో.. ప్రాజెక్టులు నిండుతాయని ప్రభుత్వాలు ఆశాభావంతో ఉన్నాయి.

వివరాలు లోపలి పేజీల్లో

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకూ ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకూ ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నారాయణపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అటు తెలంగాణకు భారీ వర్ష సూచన చేసింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ ఉండగా.. పది జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఉంది.

## పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టండి

### అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



6లో

తెలంగాణలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు

## పోలీసులు సీఎం రేవంత్‌కు కొమ్ము కాస్తున్నారు

బీజేపీయువమోర్చ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీకు అనుకూలంగా ఉన్న చానల్లో మీకు ప్రచారం చేయొచ్చు కానీ మీరు చేస్తున్న తప్పులను ప్రజలు లెక్కబెడుతున్నారు.



6లో

## రూ.50 వేల కోట్లతో
# మూసీ అభివృద్ధి
### భాగ్యనగరాన్ని పదేళ్లలో మరింత వృద్ధి



- రూ.28.5కోట్లతో గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మించాం
- శేరిలింగంపల్లిలో చెరువులను కాపాడతాం
- తెలంగాణాకు 65శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోంది
- గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# జగన్‌ను లైట్ తీసుకోండి

- ఎంపీలతో భేటీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- ఢిల్లీలో జగనేం చేస్తాడో కాదు
- మనమేం చేయాలనేదే ముఖ్యం
- జులై 22 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన టీడీపీ పార్లమెంటరీ సమావేశం
- పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు దిశానిర్దేశం

ఏపీలో రాజకీయం వేడెక్కుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ఏపీలో ఆటవిక పాలన సాగుతోందన్న వైఎస్ జగన్.. ఈ అంశం మీద ఢిల్లీలో జులై 24న ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ విషయాన్ని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లైట్ తీసుకున్నట్లు తెలిసింది. శనివారం జరిగిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో వైఎస్ జగన్ ఢిల్లీ ధర్నా అంశం ప్రస్తావనకు రాగా.. చంద్రబాబు దాన్ని పట్టించుకోవాల్సిన పనిలేదని అన్నట్లు సమాచారం.




3లో

## అంతా ఇంతే!




ఇప్పుడు తప్పించుకున్నా రేపు కేసుల వాయిదాలు తప్పించుకోలేడు

## ఓడినా... మీ వైఖరి
# మారదా?

- ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పూర్తి మెజారిటీ
- కేంద్ర మంత్రి అమిత్ షా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మండిపాటు
- పార్లమెంట్‌లో అహంకారం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు

కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వైఖరిపై కేంద్రమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఓడినప్పటికీ ఆయన మాత్రం పార్లమెంట్లో అహంకారం ప్రదర్శించారని ఆరోపించారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన పార్టీ మీటింగ్లో పాల్గొన్న అమిత్ షా.. రాహుల్పై విరుచుకుపడ్డారు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత కొందరు నాయకులకు అహంకారం పెరుగుతుందని ఇప్పటివరకు విన్నాను.



6లో

## 24న జగన్
# ఢిల్లీలో ధర్నా



3లో

- అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం
- అందరినీ కలుపుకు వెళతాం
- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి
- కూటమి అటవిక పాలనను దేశమంతా చెబుతాం
- పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో వివరిస్తాం
- వైసీపీ పార్లమెంటరీ సమావేశంలో జగన్

## పిల్లలకు ఇబ్బంది కలిగితే
# క్షమించేది లేదు

- వ్యాధులు వ్యాపించకుండా మెరుగైన చర్యలు తీసుకోవాలి
- భోజనం, తాగునీరు, వసతుల విషయంలో రాజీ పడొద్దు
- బీసీ సంక్షేమ హాస్టళ్లలోని సదుపాయాలపై మంత్రి సవిత ఆదేశాలు

బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారుల్ని ఉపేక్షించబోనని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. వర్షాలు పడుతుండడం, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు.



వివరాలు-2లో



## స్కిల్ డెవలప్‌మెంట్ కేసు.. చంద్రబాబు బెయిలు రద్దు పిటిషన్ విచారణ వాయిదా

● స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో గతేడాది నవంబర్‌లో చంద్రబాబుకు బెయిల్ ● రద్దు చేయాలని కోరుతూ అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ ● నిన్న 35 కేసులు విచారించి మిగతా కేసులను వాయిదా వేసిన ధర్మాసనం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెయిల్ పిటిషన్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో గతేడాది నవంబరులో చంద్రబాబుకు హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. దీనిని రద్దు చేయాలంటూ అప్పటి ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. అత్యవసర పని ఉందంటూ తన ముందున్న కేసులను జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్రతో కూడిన ధర్మాసనం విచారణను త్వరగా ముగించింది. దీంతో చంద్రబాబు బెయిలు రద్దు పిటిషన్ విచారణకు రాలేదు. నిన్న మొత్తం 62 కేసులు లిస్టయ్యాయి. వీటిలో చంద్రబాబు బెయిలు రద్దు పిటిషన్ 49వది. 35 కేసులను విచారించిన తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు అత్యవసర పని ఉందని, మిగతా కేసుల విచారణను వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ బేలా త్రివేది ప్రకటించారు. రెండుమూడు వారాల తర్వాత వాటిని తిరిగి విచారణకు తీసుకుంటామని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్

● అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు ● మరో 2 రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడి ● కృష్ణా నది క్యాచ్ మెంట్ ఏరియాలో భారీ వర్షాలు ● అన్ని ప్రాజెక్టులు దాటుకుని శ్రీశైలంకు చేరుతున్న వరద
● ఏపీ, ఒడిశా మధ్య నిలిచిన రాకపోకలు



అమరావతి... తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాలతో నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఏపీలో గత 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మరో 2 రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయుగుండం ఒడిశాలోని చిలికా సరస్సుకు సమీపంలో కేంద్రీకృతమై ఉందన్నారు. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీ తీరానికి నైరుతి దిశగా 40 కిలోమీటర్లు, గోపాల్ పూర్‌కు ఈశాన్యంగా 70 కి.మీల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. ఇది వాయువ్యం దిశగా కదులుతూ.. ఒడిశా – ఛత్తీస్ గఢ్ భూభాగాలపైకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ ప్రభావంతో ఎన్టీఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. అలాగే, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, నంద్యాల, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లోనూ అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు.

భారీ వర్షాలతో ఏపీలో వాగులు, వంకల్లో వరద ఉధృతి సాగుతోంది. గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. గోదారి ఉప నది శబరికి వరదతో అల్లూరి జిల్లాలోని చింతూరు – కల్లేరు గ్రామాల మధ్య గండి పడి 316వ జాతీయ రహదారి కోతకు గురైంది. దీంతో ఆ మార్గంలో ఏపీ – ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు, వర్షాలు, వరదలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం ఆదేశాలతో కలెక్టర్లు, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తుపాను తీరం దాటే వరకూ సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని.. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. తాండవ జలాశయం నీటిమట్టం సైతం పెరిగింది. తాడిగిరి వంతెన పైనుంచి వరద ప్రవహిస్తుండగా.. 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అటు, శ్రీకాకుళం, ఉమ్మడి విజయనగరం, కృష్ణా, అల్లూరి జిల్లా, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రామరాజుపాలెం వద్ద వంతెనపై వరద ప్రవహిస్తుండగా కేడీపేట – చింతపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, ఎగువన భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. బ్యారేజీ నుంచి కాల్వల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అటు, పులిచింతల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా.. నీరు వంద అడుగులకు చేరింది. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 12 వేల హెక్టార్లకు పైగా వరినాట్లు నీట మునిగాయి.



**తెలంగాణలోనూ భారీ వర్షాలు**

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకూ ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకూ ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నారాయణపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అటు తెలంగాణకు భారీ వర్ష సూచన చేసింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ ఉండగా.. పది జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఉంది. ఉత్తర తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. ఉదయం 10 తర్వాత వర్షం మరింత పెరుగుతుంది. హైదరాబాద్‌లోనూ మళ్లీ వర్షం మొదలవుతుంది. మధ్యాహ్నం 3వరకూ అలాగే కురుస్తాయి. సాయంత్రం 5 తర్వాత హైదరాబాద్, ఉత్తర, పశ్చిమ తెలంగాణలో భారీ వర్షం పడే అవకాశముంది. రాత్ర 9 తర్వాత ఉత్తర తెలంగాణలో అతి భారీ వర్షం కురుసే ఛాన్స్ అంటూ హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హైదరాబాద్ వ్యాప్తంగా నల్లని మేఘాలు కమ్ముకున్నాయి. ఇప్పటికే చిరుజల్లులు పడుతున్నాయి.

హైదరాబాద్, కామారెడ్డి, కొమరం భీం, మెదక్, ఏం.మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలకు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. అటు భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి జిల్లాలలో గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగం ఈదురు గాలులతో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. రెండు రోజుల పాటు రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ భారీ నుండి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

కాగా, గడిచిన 24 గంటల్లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కొత్తగూడెం, భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, వనపర్తి, గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురవగా.. ములుగు జిల్లా వెంకటాపురంలో అత్యధికంగా 10 సెం.మీలకు పైగా వర్షపాతం నమోదైంది. అటు, కొన్ని ప్రాంతాల్లో వర్షాల పట్ల దండోరాతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

కొద్దిగా ఆలస్యమైనా కృష్ణా ప్రాజెక్టుల్లో క్రమంగా నీరు చేరుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి , నారాయణర్ జలాశయుల దాదావుగా నిండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ భారీగా దిగువకు వదులుతోంది. ఈ జలాలు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతున్నాయి. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ఉధృతి పెరిగి తుంగభద్ర డ్యామ్‌లో లక్ష క్యూసెక్కులకు పైగా ప్రవాహం వస్తుందని కేంద్ర జల సంఘం అంచనా వేసింది. అక్కడి నుంచి కూడా శ్రీశైలంలోకి ఇన్ ఫ్లో రానుంది.

కర్ణాటక సహా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలతో కృష్ణా బేసిన్ లోని ప్రాజెక్టులకు వరద ఉధృతి పెరుగుతోంది. కృష్ణా ఉపనదులైన ఘటప్రభ, మలప్రభ, భీమా, తుంగభద్రల్లో జలకళ కనిపిస్తోంది. కృష్ణా నదిపై ఓ 10 రోజుల పాటు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగే అవకాశాలున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఊహించినట్లుగా ఇన్ ఫ్లో ఉంటే శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారుతుంది.

జూరాల నుంచి విడుదల చేస్తున్న జలాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు 32,673 క్యూసెక్కుల వరద వస్తోంది. తాగునీటి కోసం విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం నుంచి 7,063 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి 9,212 క్యూసెక్కుల నీటి ని వదులుతున్నారు. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 33.11 టీఎంసీల స్టోరేజీ ఉంది. సాగర్లో 312.05 టీఎంసీలకు, 123.34 టీఎంసీల నీళ్లున్నాయి. వర్షాలు కొనసాగే అవకాశం ఉండడటంతో ఈ ఏడాది ఈ రెండు ప్రాజెక్టులు నిండుతాయని ఆశాభావంతో ఉన్నారు.

**ప్రాజెక్టులు నిండితే నీటికి ఇబ్బంది లేనట్లే**

తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన ప్రాజెక్టులు శ్రీశైలం , నాగార్జున సాగర్, ఈ రెండు ప్రాజెక్టులు సీజన్ లో నిండితే.. ఆ ఏడాది నీటికి కరువు ఉండదు. గత ఏడాది రెండు ప్రాజెక్టులు నిండకపోవడం.. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పుడు వరద ప్రారంభంకావడంతో .. ప్రాజెక్టులు నిండుతాయని ప్రభుత్వాలు ఆశాభావంతో ఉన్నాయి.

# ఇబ్బందులు ఎదుర్కొనే రైతులకు సూచనలు అందించాలి

● రాష్ట్రంలో పంట నష్టం అంచనా వేయండి ● రైతు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయండి ● రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధానప్రతినిధి : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ కు సూచించారు. పంట నష్టం వివరాలను సేకరించాలని, ప్రభుత్వానికి ప్రతీ రోజు నివేదికలు పంపాలని ఆదేశించారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, దీని ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు.

**శ్రీనివాస్ మృతి బాధాకరం :** రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ మృతి చాలా బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేయాలనే నిర్ణయంతో కిడ్నీ, గుండె, కాలేయంతో పాటు ఇతర అవయవాలను ఆసుపత్రికి అప్పగించడం ఆదర్శనీయమని అన్నారు. శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పిల్లలకు ఇబ్బంది కలిగితే క్షమించేది లేదు



● వ్యాధులు వ్యాపించకుండా మెరుగైన చర్యలు తీసుకోవాలి ● భోజనం, తాగునీరు, వసతుల విషయంలో రాజీ పడొద్దు ● బీసీ సంక్షేమ హాస్టళ్లలోని సదుపాయాలపై మంత్రి సవిత ఆదేశాలు

ఏపీ బ్యూరో,సూర్య ప్రధాన ప్రతినిధి : బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారుల్ని ఉపేక్షించబోనని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. వర్షాలు పడుతుండడం, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. తాగునీరు, భోజనం, వసతుల విషయంలో రాజీ పడకుండా చూసుకోవాలన్నారు. మన ఇంట్లో పిల్లల్ని ఏ విధంగా చూసుకుంటామో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో హాస్టల్లోని పిల్లల విషయంలోనూ అదే విధమైన శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో పరిశీలన చేయగా, చాలా చోట్ల వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రధానంగా డయేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై చాలా చోట్ల ఫిర్యాదులు అందాయి. వసతుల విషయంలో రాజీ పడే అధికారులను ఉపేక్షించబోనన్నారు. అన్ని హాస్టళ్లలో కూడా విధిగా నిర్వహణ చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించినపుడే వారు మరింత మెరుగ్గా చదువుకునే అవకాశం ఉంటుందని మంత్రి సవిత తెలిపారు.

# 24న జగన్ ఢిల్లీలో ధర్నా

● అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం ● అందరినీ కలుపుకు వెళతాం ● రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి ● కూటమి ఆటవిక పాలనను దేశమంతా చెబుతాం ● పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో వివరిస్తాం ● వైసీపీ పార్లమెంటరీ సమావేశంలో జగన్



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈనెల 24వ తేదీ ఢిల్లీలో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారని, రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్తామని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు. ఈ ధర్నా కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతుందో వారికి వివరిస్తామన్నారు. ఈ పోరాటంలో మాతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుపోతామని వెల్లడించారు. శనివారం తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (వైయస్సార్‌సీపీపీ) సమావేశం జరిగింది. ఇందులో పార్టీ ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించారు. ఢిల్లీలో ధర్నా ముగిసిన తరువాత తరవాత పార్టీ ఎంపీలు తమ సభలకు హాజరవ్వాలని, రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై గట్టిగా మాట్లాడాలన్నారు. ఇక్కడ కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను పార్టీ ఎంపీలంతా.. తమ సభల్లో సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. యావత్‌దేశం దృష్టికి విషయాన్ని టీడీపీ అటవిక పాలన గురించి వెల్లడించాలన్నారు. ఎంపీలంతా ధర్నా కార్యక్రమంపై నిమగ్నం కావాలి: ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాము. అవి రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తామని చెప్పారు. నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీకి ఒక్కో బాధ్యత అప్పగిస్తామని, వారంతా వెంటనే ఢిల్లీ వెళ్లి, ధర్నా కార్యక్రమంపై నిమగ్నం కావాలని కోరారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయని, అందుకో రాష్ట్రపతి పాలన విధించాలని తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలని, పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదని తెలిపారు. అసెంబ్లీలోనూ నిలదీస్తాం: అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తామని,. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వినుకొండ హత్య ఇందుకు పరాకాష్టగా పేర్కొన్నారు. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అత్యంత అమానుషం. తమ రాజకీయ ప్రత్యర్థులకు, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నమని చెప్పారు. అయితే ఈ హత్యను వక్రీకరించే యత్నం జరుగుతుందన్నారు.

**హంతకుడితో వారి సంబంధాలు :** రషీద్ హంతకుడైన జిలానీ, లోకేష్ పుట్టినరోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను.. రషీద్ తల్లిదండ్రులు చూపారు. ఇంకాస్థానిక ఎమ్మెల్యేతో హంతకుడి ఫొటోలను కూడా వారు చూపించారని, ఇతను టీడీపీ కార్యకర్తేనని చెప్పారు. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి, వాహనాలు కూడా ధ్వంసం చేశారని, అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి వైసీపీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారన్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలని, కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి కోరారు. రాష్ట్రంలో వైయస్సార్‌సీపీకి లక్షల మంది కార్యకర్తలు ఉన్నారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని వెల్లడించారు.

## విజయసాయిపై అనర్హత వేటు వేయాలి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పెద్దల సభ గౌరవాన్ని, ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని టీడిపి ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న కోరారు. శనివారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కు బుద్దా వెంకటన్న లేఖ రాశారు. ఈ లేఖలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు వివరించారు. ప్రధానంగా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ శాంతి విషయంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయి పై వచ్చిన ఆరోపణలు వివరించారు. వాటిని ప్రచురించిన వార్త దినపత్రికలు, ప్రసారం చేసిన వీడియో ఛానల్స్ ప్రతినిధులపై అనుచిత రీతిలో చేసిన వ్యాఖ్యలు, విమర్శలను వివరించారు. ఆయన వైఖరి కారణంగా రాజ్యసభ గౌరవ ప్రతిష్ఠలు దిగజారిపోతున్నాయని, అతనిపై అనర్హతవేటును వేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీడ్ పోస్టు ద్వారా లేఖను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కు పంపారు.

## జగన్‌కి రాష్ట్రంలో తిరిగే హక్కు లేదు : పెమ్మసాని



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో జగన్ కు తిరిగే హక్కు లేదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. వినుకోండ లో ఇద్దరు వ్యక్తులు మధ్య జరిగిన సంఘటనను రాజకీయంగా వాడుతున్నారని, వారద్దరూ వేర్వేరు పార్టీలకు చెందిన నాయకుల వలే చెబుతూ ప్రజల్లోకి వచ్చే విధంగా ప్రయత్నలు చేస్తున్నారని ఇరోపిరారు. మాచర్ల నియోజకవర్గం లో చంద్రయ్య హత్య జరిగినవుడు ఎందుకు పరామర్శించలేదని ఆయన ప్రశ్నించారు. జగన్ డిల్లీలో కాదు గల్లీలో చేసిన అవినీతి బాగోతం అందరికి తెలుసునని, హత్య రాజకియాలును ప్రోత్సహిస్తు వస్తున్నారని తెలిపారు. ఏపీని జగన్. ఆదోగతిపాలు చేశారని, రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ జిమిక్కులు చేస్తున్నారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు.

## ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సీపీఐ శ్రేణులపై కేసులను ఎత్తివేయాలి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో వివిధ ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించిన సందర్భంగా సీపీఐ, అనుబంధ ప్రజాసంఘాల శ్రేణులపై నమోదెన కేసులను తొలగించాలని రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావులు కోరారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సీపీఐ, అనుబంధ సంఘాల శ్రేణులపై నమోదెన కేసుల వివరాలతో కూడిన జాబితాను మంత్రికి అందజేశారు. దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీపీఐ నేతలకు హామీ ఇచ్చారు.

## రైతులకు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తా



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : నాగపూర్–విజయవాడ 163(జి) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, తాము ఇచ్చిన భూముల తాలుకా నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిశారు. ఖమ్మం నుంచి విజయవాడవరకు నిర్మించే నాగపూర్–విజయవాడ 163(జి) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే మార్గంలో భూములిచ్చిన మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన రైతులు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శనివారం ఎంపి కేశినేని శివనాథ్ ను కలవటం జరిగింది. భూములిచ్చి నష్టపరిహారం కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో వివరించారు. గ్రామంలో 170 మంది హైవే నిర్మాణం కోసం భూములివ్వగా వారిలో 60 మంది మాత్రమే నష్ట పరిహారం అందిందని తెలిపారు. మిగిలిన 110 మందిలో 20 మందికి మాత్రమే అవార్డ్ కాపీ వచ్చిందని...మిగిలిన 90 మందికి అవార్డ్ కాపీ కూడా రాలేదని తెలియజేశారు. ఈ విషయం పై ఎంపి కేశినేని శివనాథ్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి అందరికీ నష్టపరిహారం అందిచేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కవులూరు రైతులు ఎంపి కేశినేని శివనాథ్ ను శాలువాతో సత్కరించారు.

## జగన్! పిచ్చి మాటలు కట్టిపెట్టు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేస్తా, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తా అంటూ పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడటం ఇకనైనా మానుకోవాలని టీడీపీ రాష్ట టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హత్య కాండలు అంటూ పల్నాడు జిల్లా వినుకొండ ఘటనపై మాట్లాడటం చూస్తే నవ్వొస్తోందన్నారు. వినుకొండ లో ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన వివాదాన్ని రాజకీయం చేయడానికి వైసీపీ వాళ్ళకి సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో అరాచకాలకు ఆద్యులు వైసీపీ నేతలన్న సంగతి జగమెరిగిన సత్యమేనన్నారు. మాజీ శాసన సభ్యులు బ్రహ్మనాయుడు పెట్టిన చిచ్చుతో మారణకాండ జరుగుతుంటే టీడీపీ పార్టీకి వులమాలని చూడటం హాస్యాస్పదంగా వుందన్నారు.

## వాహన్ పోర్టల్ అమలు తీరుపై లారీ ఓనర్స్ ఆవేదన




ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రవాణాశాఖ ఆన్ లైన్ సేవలను ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వ పోర్టల్ ఈ–ప్రగతితో పాటు కేంద్రప్రభుత్వ వెబ్ సైటు వాహన్ ద్వారా అందిస్తూ వచ్చిన అధికారులు ఇకపై ఈ–ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ ను విస్తరించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో చేపట్టిన డేటా బదలాయింపు ప్రక్రియ వల్ల వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా అన్నారు. శనివారం ఉదయం విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ పలు సేవల వివరాలు వాహన్ పోర్టల్ లో కనిపించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు మాట్లాడుతూ 2016లో ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయని, కేంద్రప్రభుత్వం ఎన్.ఐ.సీ.(నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) ద్వారా రూపొందించిన వాహన్ పోర్టల్ లో ఏపీ రవాణాశాఖ 2021లో చేరిందని, వాహన్ వెబ్‌సైట్ నెమ్మదిగా ఉండటం, ఈ–ప్రగతిలో ఉండే అనేక మాడ్యూల్స్ అందులో లేకపోవడంతో వాహనాల డేటా ట్రాన్స్ ఫర్ ప్రక్రియ జాప్యమవుతోందన్నారు. గత పదిహేను రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలోని లారీలకు సంబంధించిన ట్రాన్స్‌ఫర్, రెన్యువల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఎన్వోసీల జారీ, త్రైమాసిక పన్నులు, ఈ–చలాన్ల చెల్లింపు, ఈ–పర్మిట్ల జారీ తదితర సేవలు నిలిచిపోయి వాహనదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ జులై 8 నుండి ప్రయోగాత్మకంగా వాహనాల డేటాను ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ వెబ్ సైట్ 'ఈ–ప్రగతి' నుంచి వాహన్ పోర్టల్ (ఎన్.ఐ.సీ. సర్వర్) లోకి బదిలీ చేయడానికి ఎన్టీఆర్ జిల్లాను కాకుండా తక్కువ వాహనాలు ఉండే జిల్లాను ఎంపిక చేసి ఉండాల్సిందన్నారు.



## ప్లీజ్.. పాత విషయాలు మనసులో పెట్టుకోకండి

అమరావతి: వైకాపా ప్రభుత్వంలో చంద్రబాబుపై తొడకొట్టి, మీసాలు తిప్పి సంగతి తేలుస్తామంటూ బహిరంగ విమర్శలు చేసిన ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి క్షమాపణ కోరారు. వైకాపా ప్రభుత్వంలో చంద్రబాబుపై తొడకొట్టి, మీసాలు తిప్పి సంగతి తేలుస్తామంటూ బహిరంగ విమర్శలు చేసిన ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి క్షమాపణ కోరారు. అప్పట్లో జరిగిన పరిణామాలను మనసులో పెట్టుకోవద్దంటూ బతిమలాడారు. పైఅధికారుల ఒత్తిడి వల్లే అలా తిట్టాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. అనంతరం ఏపీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. వర్ల రామయ్యను కలిసి పోలీసు బైలాస్‌లో ఉన్న కొన్ని నిబంధనలను తొలగించాలని కోరాం. పోలీసు వ్యవస్థ మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా మాట్లాడితే దానికి కౌంటర్ ఇవ్వడమే గానీ వ్యక్తిగతంగా ఎవరిపైనా కక్ష లేదు. నాడు చంద్రబాబుపై విమర్శలు చేసినప్పుడూ ఒక పోలీసు అధికారిగా అలా చేయకూడదని నాకు అనిపించింది. గత ప్రభుత్వంలో వైకాపా నేతలు పోలీసు వ్యవస్థను నిందించినప్పుడు కూడా ఖండించాం. ప్రభుత్వ ఉద్యోగిగా ఎవరు అధికారంలో ఉంటే వారి విధానాలను అమలు చేయాల్సి వస్తుంది. మాకంటూ ప్రత్యేక అధికారాలేమీ ఉండవు. ఒకప్పుడు ఆంధ్రా పోలీసులు పనికిరారని తెలంగాణ పోలీసుల్ని ఆశ్రయించిన వైకాపా అధినేత జగన్.. అదే ఆంధ్రా పోలీసులతోనే గత ఐదేళ్లు పాలించారు. ఇప్పుడు మళ్లీ పోలీసుల్ని తప్పుపట్టడం సరికాదు. జగన్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని పేర్కొన్నారు.


# జగన్‌ను లైట్ తీసుకోండి

● ఎంపీలతో భేటీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు ● ఢిల్లీలో జగనేం చేస్తాడో కాదు
● మనమేం చేయాలనేదే ముఖ్యం ● జులై 22 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
● చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన టీడీపీ పార్లమెంటరీ సమావేశం ● పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు దిశానిర్దేశం

అమరావతి... ఏపీలో రాజకీయం వేడెక్కుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ఏపీలో ఆటవిక పాలన సాగుతోందన్న వైఎస్ జగన్.. ఈ అంశం మీద ఢిల్లీలో జులై 24న ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ విషయాన్ని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లైట్ తీసుకున్నట్లు తెలిసింది. శనివారం జరిగిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో వైఎస్ జగన్ ఢిల్లీ ధర్నా అంశం ప్రస్తావనకు రాగా.. చంద్రబాబు దాన్ని పట్టించుకోవాల్సిన పనిలేదని అన్నట్లు సమాచారం. జులై 22 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు టీడీపీ ఎంపీలతో చర్చించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే ప్రధాన అజెండాగా పనిచేయాలని ఎంపీలకు సూచించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వీలైనన్ని నిధులు రాబట్టాలని సూచించారు. అవసరమైతే ఇందుకు మంత్రుల సహకారం తీసుకోవాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమాచారం మంత్రుల నుంచి తీసుకుని.. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని చంద్రబాబు ఎంపీలకు సూచించారు. అవసరమైతే.. మంత్రులకు కూడా ఢిల్లీకి తీసుకువెళ్లాలని చెప్పారు.

ఇదే సమయంలో జులై 24న వైఎస్ జగన్ ఢిల్లీ ధర్నా అంశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయితే దీనిపై చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఎంపీలు అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన సహకారం, నిధులపై దృష్టిపెట్టాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. వైఎస్ జగన్, వైసీపీ గురించి ఆలోచన చేయాల్సిన అవసరం లేదని చంద్రబాబు ఎంపీలతో అన్నట్లు సమాచారం. వైఎస్ జగన్ గురించి ఆలోచించే ఒక్క క్షణం సమయాన్ని కూడా రాష్ట్రం కోసం ఆలోచించాలని ఓ మంత్రి సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే వైఎస్ జగన్ ఢిల్లీలో ఏం చేస్తారనేదీ ముఖ్యం కాదని.. మనం ఏం చేయాలనే ముఖ్యమని చంద్రబాబు ఎంపీలతో అన్నట్లు తెలిసింది. వైఎస్ జగన్ ధర్నాను పట్టించుకోవాల్సిన పనిలేదని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

అయితే ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపిస్తున్నారు. వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబసభ్యులను శుక్రవారం వైఎస్ జగన్ పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ ప్రేరేపిత దాడులు పెరిగాయన్న వైఎస్ జగన్.. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. అందులో భాగంగా జులై 24న ఢిల్లీలో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ధర్నా చేయనున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు. అనంతరం రాష్ట్రపతి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఏపీలో రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తామని వైఎస్ జగన్ తెలిపారు.

## హత్యలు చేసే సంస్కృతి జగన్ రెడ్డిదే



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జగన్ రెడ్డిది, వైకాపా దేనని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ గుర్తు చేశారు. శనివారం సిఎం నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యాలన్నింటిని కూటమి ప్రభుత్వానికి జగన్ రెడ్డి అంటగడుతున్నారని మండిపడ్డారు. పార్టీ మారనందుకు తమ నేత తోట చంద్రయను హత్య చేసిన సంస్కృాఎతి వైకాపా దని అన్నారు. టిడిపి ప్రభుత్యం హత్యా రాజకీయాలను అసలు ప్రోత్సహించదని అన్నారు. తోట చంద్ర య్య లాగా ఎంతో మంది టిడిపి నేతలను జగన్ రెడ్డి హత్యలు చేయించారని, ఏ మొహం పెట్టుకుని జగన్ ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తారని ఎద్దేవా చేశారు. గత ఐదు ఏళ్ళలో టిడిపి అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తే జగన్ రెడ్డి హేళన చేశారని, నిండు సభలో మాజీ ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా తమ అధినేతను అవమానించారని, తమ దళిత ఎమ్మెల్యే పై దాడి చేశారని, దీన్ని గమనించే ప్రజలు 11 సీట్లే గెలిపించారని , అయినా జగన్ రెడ్డికి బుద్ధి రాలే దని అన్నారు. జగన్ రెడ్డి బెదిరింపులకు బెదిరేవారు ఏవ్వరు లేరన్నారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి శవ రాజకీయాలను మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజాలకు ఉపయోగపడే చర్చల్లో పాల్గొంటే మంచిదని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు చెప్పారు. 5 ఏళ్ల పాటు నేరాలు,ఘోరాలతో రాష్ట్రాన్ని నేరాంధ్రగా మార్చిన జగన్ రెడ్డి నేడు రాష్ట్రపతి పాలన గురించి మాట్లాడటం విడ్డూరమని మంత్రి పేర్కొన్నారు. రేపల్లెలో అమర్నాధ్ గౌడ్,మాచర్లలో తోట చంద్రయ్య, మదనపల్లిలో ఫాతిమా ఇలా వైసీపీ పాలనలో జరిగిన దారుణ హత్యలు చాలానే ఉన్నాయన్నారు. ఎన్డీయే కూటమి నెల రోజుల పాలనకే రాష్ట్రపతి పాలన కావాలంటే..మరి నాడు మీ అరాచక పాలనకు మిమ్మల్ని ఈ పాటికి దేశ బహిష్కరణ చేసి ఉండాలని పేర్కొన్నారు. ఇకనైనా మీ వంకర బుద్ది మార్చుకోకపోతే కచ్చితంగా ప్రజలే మిమ్మల్ని దేశం నుంచి తరిమికొడతారు గుర్తుపెట్టుకో జగన్ రెడ్డి అని హెచ్చరించారు. ఢిల్లీలో ధర్నా చేసేముందు ఆంధ్రలోని గల్లీగల్లీలో నీ అరాచక పాలన ఆనవాళ్లకు కాళ్ళ మీద పడి క్షమాపణ కోరితే ప్రజలు హర్షిస్తరని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.

## సీఎంవోలోని ఐఏఎస్‌లకు శాఖల కేటాయింపు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సిఎం చంద్రబాబు కార్యాలయంలోని నలుగురు ఐఏఎస్ అధికారులను శనివారం శాఖలను ఖరారు చేసింది. వారు వారు పర్యవేక్షించాల్సిన శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ముద్దాడ రవిచంద్ర, ఏవీ రాజమౌళి, ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్రాకు పలు విభాగాలను అప్పగించింది. రవిచంద్ర సీఎం కార్యాలయం, సాధారణ పరిపాలన శాఖ, హర్ ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, దేవాదాయ శాఖలను చూడనున్నారు.రాజమౌళికి జలవనరులు, విద్యుత్, గనులు వ్యవసాయం, సీఎంఆర్ఎఫ్, ఫిర్యాదులు తదితర శాఖలను కేటాయించారు.ప్రద్యుమ్నకు రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్టీజీఎస్, అటవీ, పౌరసరఫరాల శాఖలు కార్తికేయకు ఐటీ, ఎస్ఆర్ఎస్ఐ వ్యవహారాలు, సమాచార పౌర సంబంధాలు, సీఎం ఢిల్లీ, విదేశీ పర్యటనలను చూడనున్నారు.ఇంకా మున్ముందు కొన్ని శాఖలను ఇతరులకు కూడా కేటాయించే అవకాశం ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

# ఇటు వరదలు - అటు ప్రాణహాని సమాచారం

● భిన్నంగా సతీమణి గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పవన్ ● నిఘా వర్గాల హెచ్చరికతో తల్లడిల్లుతున్న పార్టీ యంత్రాంగం ● సింగపూర్‌లో స్నాతకోత్సవానికి హాజరైన పవన్ కల్యాణ్ ● భార్య రెండో మాస్టర్స్ డిగ్రీ సాధించినందుకు అభినందనలు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సతీమణి అన్నా లెజినోవా గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గోనడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మరీ ముఖ్యంగా జనసేన వర్గాల్లో, ఆయన్ను అభిమానించే ప్రజల్లో ఇది ఎక్కువగా ఉంది. ఒక వైపున వర్షాలు, వరదలు కారణంగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజానీకం. గోదావరి జిల్లాల ప్రజలు, రైతులు వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పొంగిన గోదావరి కారణంగా పంట పొలాలు. నివాసిత ప్రాంతాలు ముంపునకు గురికావడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఫలితాల తరువాత తనకు కేటాయించిన శాఖల పట్ల అవగాహన పెంచుకునే ప్రయత్నంలో ఉండటంతోపాటు ఆ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళతానని పవన్ అనేకసార్లు అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు.ఆయన మాట తీరు, అనుసరిస్తున్న విధానాలు కూడా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. పవన్ అండతో మన ప్రాంతం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా తయారవుతుందని అంతా భావిస్తున్నారు. అయితే వరదలు, వర్షాలు కురుస్తున్నా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, పవన్ మాత్రం మూడు రోజుల నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. కనీసం ఆయన అనుచరులు, కార్యాలయ సిబ్బంది కూడా ఇక్కడి పరిస్థితులపై ఎటువంటి శ్రద్ధ చూపించిన దాఖలాలు లేవు. అయితే అయనపై ఉన్న అచంచల నమ్మకం ఆయన రాకపోయినా...తమ గురించి చిన్న ప్రకటన ఇవ్వకపోయినా..ప్రజలు ఏ మాత్రం ఆవేదన వ్యక్తం చేయలేదు. అసమ్మతిని వెల్లడించలేదు. ఆలస్యంగా వచ్చినా తమ సమస్యలు తీర్చుతాడనే నమ్మకం వారిలో ఉండటం వల్లనే తమ బాధను వ్యక్తం చేయలేదు. అనూహ్యంగా ఆయన ప్రాణానికి హాని ఉందనే వార్తలు వెలుగులోకి రావడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. కేంద్ర నిఘా వర్గాలు ఈ సమాచారం ఇవ్వడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. అయితే అందరి అంచాలకు భిన్నంగా పవన్ ఆయన సతీమణి అన్నా లెజినోవా గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలియడంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

అన్నా లెజినోవా సింగపూర్ లోని ఓ ప్రఖ్యాత యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్నసందర్భంలో పవన్ కూడా అక్కడకు వెళ్లారు. వాటికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చాయి. దీనిపై ప్రజలకు ఏ విధంగా స్పందించాలో అర్థంకాని పరిస్థితి.

ఇటు తాము ఇబ్బందులు..అటు ఆయనకు ప్రాణిహాని సమాచారం రెండు ఇబ్బంది కలిగించే అంశాలే. అయితే వీటికి భిన్నంగా పవన్ ఉండటమే అక్కడే కాదు రాష్ట్ర మంతా చర్చనీయాంశమైంది.

## 21న బెంగుళూరులో అమరావతి విజయోత్సవ సభ



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈనెల 21వ తేదీ ఆదివారంనాడు కర్ణాటక తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో అమరావతి విజయం, నిజం గెలిచింది పేరిట విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షులు దొంది రామస్వామి తెలిపారు. శనివారం అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య తో కలిసి ఆయన విజయోత్సవ సభకు పలువురు ఎపీ మంత్రులను ఆహ్వానించారు. ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, బిసి వెల్ఫేర్ మంత్రి సబితా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి లను ఏపీ సచివాలయంలో స్వయంగా కలిసి ఆహ్వానించారు. బెంగుళూరు అమరావతి విజయోత్సవ సభలో అమరావతి మరియు దళిత ఉద్యమ నాయకులు బాలకోటయ్య ను అభినవ జాషువా అవార్డు తో సత్కరిస్తున్నట్లు చెప్పారు. సమితి ప్రధాన కార్యదర్శి బాబు రాజేంద్రప్రసాద్, నారాయణ తదితరులు ఉన్నారు.

# వైభవంగా సింహగిరి ప్రదక్షిణ.. భక్త జనసంద్రంగా మారిన సింహాచలం

### ఘనంగా కొనసాగుతున్న సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ

విశాఖపట్నం: సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ వైభవోపేతంగా కొనసాగుతోంది. సింహాచలం తొలి పావంచా దగ్గర కొబ్బరికాయ కొట్టిన భక్తులు.. అక్కడి నుంచి అడవివరం, పెదగదిలి, చినగదిలి, హనుమంతువాక, విశాలాక్షి నగర్ అప్పుఘర్, సీతమ్మధార, నరసింహ నగర్, మాధవధార, ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, గోశాల మీదుగా మళ్లీ తొలి మెట్టు వరకు 32 కి.మీ మేర భక్తులు గిరిప్రదక్షిణ చేస్తున్నారు. సింహ గిరి ప్రదక్షిణ సాగే మార్గంలో ప్రతి 500 మీటర్లకు ఒక కౌంటర్ ద్వారా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి పరిశీలిస్తున్నారు. ఏటా ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని చతుర్దశినాడు సింహాచలం గిరి ప్రదక్షిణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా ఆదివారం వేకువజామున సింహాద్రి నాథుడికి తుది విడత చందనం సమర్పిస్తారు.

***గిరి ప్రదక్షిణలో గంటా శ్రీనివాసరావు***

భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఇప్పటికే దాదాపు 9 లక్షల మంది గిరిప్రదక్షిణ చేస్తున్నట్లు చెప్పిన ఆయన.. అంతకంతకూ భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలపై సింహాచల అప్పన్న అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

***భారీగా నిలిచిపోయిన వాహనాలు***



గిరి ప్రదక్షిణకు భారీ సంఖ్యలో భక్తులు రావడంతో సింహాచలం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వేపగుంట, గోశాల, గోపాలపట్నం కూడళ్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## ఎట్టిపరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు



ఈసారి కేంద్ర బడ్జెట్ ఏపీకి న్యాయం జరిగేలా ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి: ఈసారి కేంద్ర బడ్జెట్ ఏపీకి న్యాయం జరిగేలా ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో వెనుకబడిన జిల్లాలు ఉన్న క్రమంలో ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ విషయంలో వెసులుబాటు కల్పించాలని కేంద్రాన్ని కోరతామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కాబోదని అన్నారు. కేంద్ర నిధులను గత జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని, కేంద్ర పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతోనే కేంద్ర పథకాలు ఆగాయన్నారు. జగన్ పాలనలో అవకతవకలు జరిగినట్లు కేంద్రం కూడా చెప్పిందన్నారు.

## మాజీ ఎంపీ నందిగం సురేష్ అక్రమ భవనంపై హైకోర్టు విచారణ



అమరావతి: గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతం లోని ఉద్దండరాయునిపాలెంలో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ నిర్మించిన భవనానికి అనుమతులు లేవని సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రాంతం సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నందున సీఆర్‌డీఏతో పాటు ఉద్దండరాయునిపాలెం పంచాయతీ అధికారులు సంయుక్తంగా నోటీసు ఇచ్చారు.

ఈ నోటీసులపై మాజీ ఎంపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. శనివారం విచారణ జరి గింది. సురేష్ భవనం అంశంలో చట్ట ప్రకారం నిర్ణ యం తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది.

అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టరాదని పిటిషనర్‌కు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

## అధికారానికి 40 రోజులు దూరమైతేనే తట్టుకోలేకపోతున్నారా జగన్?




విశాఖపట్నం: అధికారానికి 40 రోజులు దూరమైతేనే తట్టుకోలేకపోతున్నారా జగన్? అని తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా ఆయన జగన్ తీరుపై మండిపడ్డారు. మీ దోపిడీ పాలనకు విసుగు చెందే కదా ఏపీ ప్రజలు చరిత్ర ఎరుగని తీర్పునిచ్చి మీకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. ఆ ఘోర పరాభవాన్ని గుర్తు చేసుకుని కుమిలిపోతున్నారా? కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇంకా రెండు నెలలైనా కాలేదు. ప్రజా తీర్పునకు కలత చెంది మొన్నటి వరకు హిమాలయాలకు వెళ్లిపోతానన్న మీరేమో ఇప్పుడు రాష్ట్రపతి పాలన పెట్టాలని అడుగుతున్నారు. మీ ఆత్మగా ఉన్న ఎంపీగారేమో మధ్యంతర ఎన్నికలు పెడితే మళ్లీ మీ పార్టీ అధికారంలోకి వస్తుందని అంటున్నారు. మీ మానసిక స్థితిని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని 24న దిల్లీలో ధర్నా చేస్తానన్న మీ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టున్నాయని అనిపించడం లేదా?

అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా అయిదేళ్లు పాలించింది మీరు. సొంత రాజ్యాంగంతో స్వైర విహారం చేసి వందల సంఖ్యలో ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తల సహా అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న చరిత్ర మీదే. కరోనా సమయంలో మాస్కు అడిగిన పాపానికి విశాఖలో దళిత డాక్టర్ సుధాకర్‌ను చనిపోయేంత వరకు వేధించారు. తూర్పు గోదావరి జిల్లాలో మీ ఎమ్మెల్సీ అనంత బాబు దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీరు చేసిన పాపాలు, పాతకాలకు అంతే లేదు.

ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబుకి ఇచ్చిన సఫారీ వాహనమే కదా మీకూ ఇచ్చింది. విజయనగరం నుంచి తాడేపల్లి వరకు 9 గంటలు నిరాటంకంగా ప్రయాణించిన వాహనానికి ఎలాంటి సమస్య లేకపోయినా ఎక్కిన 10 నిముషాల్లో మీ సొంత ఫార్చ్యూనర్ లోకి మారిపోయి ప్రభుత్వంపై బురద జల్లడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా క్షేత్రంలో ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాడండి. ప్రజలు హర్షిస్తారు. అంతే గానీ ఓటమిని జీర్ణించుకోలేక కుట్ర రాజకీయాలకు తెర లేపితే డబుల్ డిజిట్ 11 ఇచ్చిన ప్రజలు వచ్చేసారి మిమ్మల్ని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేస్తారు గుర్తు పెట్టుకోండి అని గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు.

## జగన్‌వి శవ రాజకీయాలు
### జనసేన నేత నాగబాబు



అమరావతి: వినుకొండలో రషీద్ హత్యపై మాజీ ముఖ్యమంత్రి జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని జనసేన నేత నాగబాబు విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటై 2 నెలలు కాలేదు.. అప్పుడే విమర్శలా అని ప్రశ్నించారు. దేశచరిత్రలో ఎన్నడూ లేనంత దుర్మార్గ పాలన జగన్ హయాంలో చూశామని మండిపడ్డారు. ఆయన మరోసారి అధికారంలోకి రాకుండా చేసి ప్రజలు తమను తాము కాపాడుకున్నారని తెలిపారు. శాసనసభ సమావేశాలను ఎగ్గొట్టేందుకే జగన్ దిల్లీ వెళ్తున్నారని నాగబాబు ఆరోపించారు.వినుకొండలో రషీద్ హత్యపై మాజీ ముఖ్యమంత్రి జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని జనసేన నేత నాగబాబు విమర్శించారు.

## ఏపీ-ఒడిశా మధ్య రాకపోకలకు అంతరాయం



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో శబరి నదితో పాటు, పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఏపీ-ఒడిశా మధ్య ఉన్న 316 జాతీయ రహదారిపై కొన్ని చోట్ల గండ్లు పడ్డాయి. చింతూరు-కల్లేరు గ్రామాల మధ్య గండ్లు పడడంతో ఏపీ, ఒడిశా మధ్య రాకపోకలు ఆగిపోయాయి. ఇక రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పికే ఐఎండీ ప్రకటించింది. భారీ నేపథ్యంలో, ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత అధికారులను అప్రమత్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సహాయ చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు ఉపయోగించాలని అచ్చెన్నాయుడు అన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా సిబ్బంది ఎప్పుడూ కూడా సిద్దంగా ఉండాలని ఆయన తెలిపారు. వాయుగుండం కొనసాగుతున్నందున, మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

## వాయుగుండం క్రమంగా బలహీనపడే అవకాశం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వచ్చే 24 గంటల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. పశ్చిమ-వాయువ్య దిశగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయుగుండం కదులుతున్నదన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశంఉందన్నారు. సహాయక చర్యల కోసం 3ఎన్డీఆర్ఎఫ్, 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలెవరూ వరద ప్రవహిస్తున్న వాగులు,కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

L.B. నగర్ సర్కిల్ - 4

నిట్ నెం.05/EEC-4/LBNR/GHMC/2024-25, తేది: 20-07-2024

**పని పేరు:** మెయింటెనెన్స్ పనుల సంఖ్య 1. **అంచనా వ్యయం : 1.20 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది మరియు సమయం :** 22-07-2024 మ॥ 3.00 గం॥లకు. **బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 25-07-2024 మ॥ 3.00 గం॥ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ వి. కార్తిక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్ - 4, GHMC, సెల్: 9701365519. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్ - 4, GHMC

DIPR.RO.No.1965-PP/CL/Advt/1/2024-25 , Dt: 20-07-2024

ప్రమాణాలు లేని రైలు బోగీల్లో ప్రయాణీకులు ప్రయాణం చేయాలంటే దడ పుట్టేటట్లుగా ఈ మధ్య సంఘటనలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన బాలాసోర్ ప్రమాదం లో జరిగిన ప్రమాదానికి కారణాలను రైల్వే భద్రత కమీషనర్ ఇచ్చిన నివేదిక యెన్నో లోపాలను ఎత్తిచూపింది. కేబుల్ లోపాన్ని కీలకమైన సర్క్యూట్ బోర్డ్ మీద మార్క్ చేయకపోవడం , ప్రామాణిక పద్ధతులు పాటించకపోవడం, ఎలక్ట్రానిక్స్ సిగ్నలింగ్ ఇంటర్లాకింగ్ సిస్టం, రిలేరూం లలో ఉండే అధికార స్థాయి, అరకొరగా మరమ్మత్తులు చేయడం, వైరింగ్ మరియు కేబుల్ ఫాల్ట్ ఉండే లోపాలను తెలిపింది. ప్రమాదానికి కారణం మానవ తప్పిదమేనని తెలిపింది. **సదుపాయాల లేమి:** ప్రయాణీకులకు ద్వితీయ, తృతీయ శ్రేణి బోగీల్లో

## దడ పుట్టిస్తున్న రైలు ప్రయాణాలు

సదుపాయాలు ఏమీ ఉండడం లేదు. ఇక జనరల్ బోగీల్లో ఉండే సదుపాయాలు ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. కొన్ని సార్లు మూత్రశాలలో నీటి సదుపాయం ఉండడం లేదు. పరిశుభ్రంగా ఉండం లేదు. అరకొర సదుపాయాలతో ప్రయాణాలు సాగుతున్నాయి. ఫిర్యాదు చేద్దామంటే ఎవరూ కనిపించడంలేదు ఒకవేళ చేసినా పట్టించుకున్న నాధుడు ఎవరూ ఉండం లేదు.ఆన్లైన్లో రైల్వే శాఖ మదాద్ లో ఫిర్యాదు చేయొచ్చని ఎంత మందికి తెలుసు? ఇక 139 టోల్ ఫ్రీ నంబరుకి ఫోన్ చేస్తే తలనొప్పి తప్పదు. హిందీ, ఇంగ్లీష్ లో ఫిర్యాదు చెయ్యమని అడుగుతుంది. ఎంత మందికి ఈ రెండు భాషలు తెలుసు. అప్పుడప్పుడు స్థానిక భాషల్లో ఫిర్యాదు తీసుకుంటుంది. సరైన టైంలో లైన్స్ కలవవు. సమస్య పరిష్కారం అయ్యేలోపు ప్రయాణికులు వారి గమ్యాలకి చేరిపోతునారు. ఇంకా పరిమితికి మించి ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తున్నారు. కొంతమంది టికెట్స్ లేకుండా టికెట్ కలక్టర్కి డబ్బులతో ప్రసన్నం చేసుకొని ప్రయాణం చేస్తున్నారు. కారణంగా బోగీల నిండా జనం కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ప్రయాణంలోనే ఒకరినొకరు తప్పించుకొని నడవవలసి వస్తుంది. ఈలాంటి సమయంలో ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా బయటకు రావడం కష్టం. తొక్కిసలాట జరగడానికి అవకాశం ఉంటుంది.ఒక వేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం జరుగకుండా ఉండే విధంగా రైల్వే బోగిలు ఉన్నాయా..? అనే కోణంలో కూడా ఆలోచించాలి.

**ప్రమాదాల నుండి పాఠాలు తెలుసుకోవాలి:**ప్రమాదాలపై దర్యాప్తు చేసి కారణాలు అన్వేషించి కారకులపై చర్యలు తీసుకోవడంతోనే చెయ్యి దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ప్రమాదాలు నివారించడానికి బోగీలు లోపాలతో పాటు, రైలు సురక్షితంగా నడవడానికి సిగ్నలింగ్, టెలి కమ్యూనికేషన్, వంటి అన్ని వ్యవస్థలలో ఉండే లోపాలని సరి చేయాలి. అధునాతన పరికరాలను ఉపయోగించాలి. కావాలంటే విదేశాలలో అభివృద్ధి చెందిన దేశాలలో రైల్వే వ్యవస్థను పరిశీలించి వారి సహకారం తీసుకోవడంలో తప్పులేదు. ప్రయాణికుల భద్రత మీదే దృష్టి పెట్టాలి. కొత్త ట్రాక్ లు నిర్మించాలి. అవసరమైతే బోగీల డిజైన్లో మార్పులు తీసుకురావాలి. ప్రధానంగా పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించకుండా చూడాలి. దీని కారణంగా ప్రమాదం జరిగినా తొక్కిసలాట జరగదు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తు లో జరగ కుండా చూడవలసిన బాధ్యత రైల్వే శాఖ తీసుకోవాలి..రైల్వే శాఖ చార్జీలు పెంచడంలో ఉండే శ్రద్ధ కనీస సదుపాయాలు మీద కూడా దృష్టి పెట్టాలి .జరిగిన ప్రమాదాలపై పాఠాలు నేర్చుకుని నివారణా చర్యలు తీసుకోవాలి . ప్రయాణికులకు భరోసా కలిగించాలి. ఇటువంటివి జరగకూడదు అంటే ప్రయాణికులు కూడా సహకరించాలి. వారి ఇంటిపైన ఉండే శ్రద్ధ ప్రయాణిస్తున్న బోగిల మీద కూడా ఉండాలి. ప్రజల సహకారం లేనిదే ప్రభుత్వాలు ఒక్కటే చెయ్యలేవు.

# టీడీపీని వైసీపీ ఎలా ఎదుర్కొంటుంది?

● ప్రధాన ప్రతిపక్ష హోదా లెక్కేంటో తెలియని పరిస్థితి ● తొలిరోజు హాజరవుతామని ఇప్పటికే జగన్ ప్రకటన రాష్ట్ర పరిస్థితులపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం ● చర్చల్లో పాల్గొనేందుకు జగన్కు తగినంత సమయం లభిస్తుందా అన్నది ప్రశ్న ● జగన్ని ధీటుగా అడ్డుకునేందుకు సిద్ధమవుతున్న తెలుగుదేశం



**బి.వి.రమణ**
**9440740015**


త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షమైన టీడీపీని వైఎస్ జగన్మోహన్రెడ్డి, ఆ పార్టీ వైఎస్ఆర్సీపీ ఎలా ఎదుర్కొంటుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎల్లుండి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ఈ 18న అధికారులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు విభాగాలపై శ్వేతపత్రాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో మరికొన్ని వాటిపై శ్వేతపత్రాలు విడుదల చేయనుంది. అధికార పక్షమైన టీడీపీ, జనసేన, బీజేపీకి పూర్తి స్థాయిలో మెజారిటీ ఉండటం, వైఎస్ఆర్సీపీకి తక్కువ సంఖ్యలో ఉండటంతో అధికార పక్ష దాడిని వైఎస్ఆర్సీపీ ఎదుర్కొని నిలబడుతుందనేది చర్చగా మారింది.

**ప్రధాన ప్రతిపక్ష హోదా లెక్కేంటి?**

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 168 నుంచి 221 వరకూ రాష్ట్రాల శాసనసభలు, మండళ్ల నిర్వహణ, విధుల గురించి ప్రస్తావించారు. ఏదైన చట్ట సభలో అధికార పార్టీ/ అధికారంలో ఉండే పార్టీల తర్వాత పెద్ద పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది. నిజానికి 1977వరకూ ప్రధాన ప్రతిపక్ష హోదా సమస్య రాలేదు. అంతకుముందు లీడర్ ఆఫ్ అపోజిషన్ అనే వివాదమే లేదు. రెండో పెద్ద పార్టీకి గుర్తింపు ఇచ్చేవారు. కానీ తొలిసారిగా 1977లో కాంగ్రెస్ ఓటమి తర్వాత లీడర్ ఆఫ్ అపోజిషన్ పోస్టుకి చట్టబద్ధత కల్పించారు.1977లో రూపొందించిన నిబంధనల ప్రకారం పార్లమెంట్/ శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా కలిగిన పార్టీ నేతకు కొన్ని సదుపాయాలు కల్పించారు. దాని ప్రకారం ప్రధాన ప్రతిపక్ష నేత హోదా దక్కాలంటే సభలో ఆ పార్టీకి కనీసం 10 శాతం సభ్యులుండాలి. ఈ మేరకు లోక్సభలో 55, ఏపీ అసెంబ్లీలో 18 సీట్లు దక్కిన పార్టీలకే ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుంది. నిర్ణీత సంఖ్యలో సీట్లు దక్కిన పార్టీ నాయకుడిని ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ ప్రకటిస్తారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఏపీ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీకి 135, జనసేనకి 21 , వైఎస్సార్సీపీకి 11, బీజేపీకి 8 సీట్లు చొప్పున దక్కాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా బరిలోకి దిగడంతో, ఆ పార్టీలు ప్రభుత్వంలో భాగస్వాములయ్యే అవకాశం కనిపిస్తోంది.అయితే 11 స్థానాలు మాత్రమే గెలుచుకున్న వైసీపీ ప్రతిపక్షం అవుతుంది. అయితే అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష స్థానం దక్కాలంటే ఆ పార్టీకి కనీసం 18 మంది ఎమ్మెల్యేల బలం ఉండాలి. దీంతో ఇప్పుడు వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కే అవకాశం కనిపించడం లేదు.మాజీ సీఎం జగన్ హాజరుపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఆయన వస్తారని మాజీ మంత్రి పేర్నినాని స్పష్టం చేశారు. జగన్తో సహా 11 మంది ఎమ్మెల్యేలు వస్తారని.. ప్రభుత్వాన్ని నిలదీస్తారని పేర్కొన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టలేని అసమర్థ ప్రభుత్వమిదని.. అసెంబ్లీలో మా వ్యూహాలు మాకున్నాయని అన్నారు. ఇదిలాఉండగా.. వైసీపీ కి 11 సీట్లు మాత్రమే రావడంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లేదు. దీంతో జగన్ సాధారణ ఎమ్మెల్యేగానే రానున్నారు. అయితే చర్చల్లో పాల్గొనేందుకు జగన్కు తగినంత సమయం లభిస్తుందా లేదా అనేది తెలియాల్సి ఉంది. అలాగే అసెంబ్లీలో ఆయన వ్యూహం ఏంటి.. ఎలాంటి అంశాలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారే దానిపై ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం అధికార పక్షంలో ఉన్న కూటమి భాగస్వాములైన టీడీపీకి 135 మంది సభ్యులు ఉండగా, జనసేనకు 21, బీజేపీకి 8 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్ఆర్సీపీకి కేవలం 11 మంది మాత్రమే సభ్యులు ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి కలిపి 164 సభ్యులు ఉన్నారు. వైఎస్ఆర్సీపీ కంటే 153 మంది సభ్యులు అధికంగా ఉన్నారు. ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరపాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారు. శాసన సభ, శాసన మండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం చేయనున్నారు. తర్వాత గవర్నర్ ప్రసంగంపై చర్చ చేయనున్నారు. ఈ సమావేశాల్లోనే ఓట్ఆన్ అకౌంట్ బడ్జెట్ను ప్రవేశ పెట్టనున్నారు. వచ్చే ఐదు మాసాలకు అవసరమైన బడ్జెట్ను ప్రవేశ పెట్టనున్నారు. వీటితో పాటుగా శ్వేత పత్రాల విడుదలకు కూడా అసెంబ్లీ సమావేశాలను వేదికగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్, మైనింగ్ రంగాలపై నాలుగు శ్వేత పత్రాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్కిన శాంతి భద్రతలు, ఎక్సైజ్, ఆర్థిక రంగాలకు సంబంధించి మూడు శ్వేత పత్రాలను ఈ సమావేశాల్లో ప్రవేశ పెట్టి చర్చ జరపాలని భావిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ఆర్సీపీ దూరంగా ఉంటుందని అధికార పక్షం భావించింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం సందర్భంగా జరిగిన తొలి సమావేశాల్లో జగన్ ప్రమాణ స్వీకారం చేసి వెంటనే వెళ్లి పోవడం, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కూడా వారి ప్రమాణ స్వీకారం అయిపోయిన వెంటనే వెళ్లి పోవడం, రెండో రోజు జరిగిన సమావేశానికి జగన్తో పాటు వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలు పాల్గొనక పోవడంతో ఈ సారి సమావేశాలకు కూడా జగన్తో పాటు వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉంటారని అధికార పక్షంతో పాటు రాజకీయ వర్గాలు కూడా భావించాయి. కానీ అంచనాలను తారు మారు చేస్తూ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానుంది. వినుకొండ పర్యటనలో స్వయంగా జగన్మోహన్రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రభుత్వమే హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రభుత్వ పాలన తీరును అడ్డుకొని తీరుతామని, దీని కోసం అసెంబ్లీ సమావేశాలలో పాల్గొని అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వ అరాచకాలను అడ్డుకుంటామని ప్రకటించారు. దీంతో అధికార పక్షానికి ఒక్క సారిగా షాక్ తగిలినట్లైందనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. జగన్ను, ఆయన పార్టీ ఎమ్మెల్యేలను సమావేశాల్లో ఎలా కట్టడి చేఆయలనే దానిపై అధికార పక్షం కసరత్తు చేస్తోంది. జగన్ ప్రభుత్వంలో చోటు చేసుకున్న సంఘటనలు, టీడీపీ శ్రేణులపై అరాచకాలు జరిగాయని వీటిని ప్రస్తావించడంతో పాటు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుందనే దానిపైన, మూడు శ్వేత పత్రాలను ప్రవేశపెట్టి వాటి పై జరిగే చర్చల ద్వారా వైఎస్ఆర్సీపీని ఇరుకున పెట్టాలనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ఇదే సమయంలో జగన్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వ పాలన తీరుపైన ప్రస్తావించడం, సీఎం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న హింసపై ప్రధాన అంశంగా ప్రస్తావన చేయాలని వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. అధికార పక్షంతో పోల్చితే వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేల్లో పెద్దగా వాగ్ధాటి ఉన్న వారు లేరు. 11 మంది సభ్యులున్నా ప్రభుత్వాన్ని నిలువరించే బాధ్యంతా జగన్పైనే పడే అవకాశం ఉందనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నా ఆయనకు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేంత వాగ్ధాటి లేదని, ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథ్రెడ్డి పరిస్థితి కూడా అంతేననే టాక్ ఆ పార్టీలో సాగుతోంది. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, బద్వేలు ఎమ్మెల్యే దాసరి త్రిధ, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిలు అధికార పక్షాన్ని ఎలా నిలువరిస్తారనేది చూడాలనే టాక్ నడుస్తోంది. మొత్తమ్మీద ఈ సారి ఎన్నికైన 11 ఎమ్మెల్యేల్లో వాగ్ధాటి కలిగి ఉండి, అన్ని అంశాలపై అవగాహనతో మాట్లాడే వారు తక్కువ ఉండటం జగన్కు ఒక మైనస్గానే భావించొచ్చు.రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో ప్రజలకు ఉపయోగ పడిన విధంగా చర్చలు సాగింది లేదు. అధికా పక్షం ప్రతిపక్షాన్ని నోరెత్తకుండా చేయడం, మాట్లాడేందుకు సమయం కూడా కేటాయించక పోవడం, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం వంటి కార్యక్రమాలతోనే సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ సారి కూడా దీనికి భిన్నంగా ఏమీ ఉండవనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

# ఉభయ సభల్లో ఏపీ మద్దతే కీలకం

● ఇప్పుడైనా విభజన హామీలకు మోక్షం లభిస్తుందా! ● లోక్ సభలో ఎన్డీయేకి ప్రధాన మద్దతుదారుగా టిడిపి రాజ్యసభలో లకంగా మారుతున్న వైసిపీ ● ఇప్పటికే అనునిత్యం ఎన్డిఏకి మద్దతునిస్తున్న పంకాపార్టీ ● యన్.డి.ఏ ప్రవేశ పెట్టిన ముఖ్యమైన బిల్లులకు మద్దతు



**కైలసాని శివప్రసాద్**
**9440203999**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 25 పార్లమెంటు స్థానాలలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో యన్.డి.ఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ 16 స్థానాలలో,జనసేన పార్టీ 2 స్థానాలలో,భారతీయ జనతాపార్టీ 3 స్థానాలలో మరియు విపక్ష వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలలో గెలుపొందాయి. కేంద్రంలో నరేంద్రమోడీ ఆధ్వర్యంలో మూడవ పర్యాయం ప్రభుత్వ ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 21 మంది యన్.డి.ఏ పార్లమెంటు సభ్యులు కీలకంగా మారారు. ఒక విధంగా చెప్పాలంటే రాష్ట్రం నుండి విజయం సాధించిన 21 మంది యన్.డి.ఏ పార్లమెంటు సభ్యుల వలనే నరేంద్ర మోడీ 3.0 ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని కచ్చితంగా చెప్పవచ్చు.అదేవిధంగా రాష్ట్రానికి చెందిన 11 రాజ్యసభ స్థానాలు వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఖాతాలో ఉండడం గమనార్హం. ఇటీవల పార్లమెంటు స్పీకర్ ఎన్నికల్లో యన్.డి.ఏ అభ్యర్థికి వై.యస్.ఆర్.సి.పి మద్దతు తెలిపింది.గత అయిదు సంవత్సరాల కాలంలో ఉభయ సభల్లో యన్.డి.ఏ ప్రవేశ పెట్టిన ముఖ్యమైన బిల్లులకు వై.యస్.ఆర్.సి.పి మద్దతు తెలియచేసింది. వై.యస్.ఆర్.సి.పి అధినేత కు ఉన్న వ్యక్తిగత సమస్యల కారణంగా ఇప్పట్లో నరేంద్ర మోడీని వ్యతిరేకించే పరిస్థితి జగన్ మోహన్ రెడ్డికి లేదు. పర్యవసానంగా ప్రస్తుత పరిస్తితుల్లోనూ ఉభయసభల్లో యన్.డి.ఏ కు వై.యస్.ఆర్. కాంగ్రెస్స్ పార్టీ భేషరుతుగా మద్దతు తెలుపుతుందని స్పష్టంగా అర్ధమౌవుతుంది. ప్రస్తుతం రాజ్యసభలో యన్.డి.ఏ బలం 101 కే పరిమతమయ్యింది. దీంతో ప్రధానమైన బిల్లులు రాజ్యసభలో నెగ్గాలంటే యన్.డి.ఏ యేతర తటస్థ పార్టీలపై ఆధారపడవలసిన పరిస్థితి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఏర్పడింది. రాజ్యసభలో యన్.డి.ఏ ప్రవేశ పెట్టే బిల్లులు నెగ్గాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ 11 మంది సభ్యులు మద్దతు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కావాల్సిందే.దీంతో కేంద్రంలో నరేంద్రమోడీ ఆధ్వర్యంలో మూడవ పర్యాయం ప్రభుత్వ ఏర్పాటులో మరియు ఉభయసభల్లో కీలక బిల్లులు నెగ్గేందుకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులదే ప్రధాన పాత్ర.ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న అయిదు కోట్ల ఆంధ్రులు ఈ పర్యాయం కచ్చితంగా విభజన హామీలకు మోక్షం లభిస్తుందని ఆశిస్తున్నారు.రాష్ట్ర ప్రజల ఆశలు అలివికాని ఆశలు కాదు.ప్రజల కోర్కెలూ గొంతెమ్మ కోర్కెలు కాదు.ప్రజల డిమాండ్లూ కొత్తవేమీ కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన వలన ఉన్నతమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు,ఆధాయవనరులు కోల్పోయి, లోటుబడ్జెట్ తో, రాజధాని లేని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం జీవచ్ఛవంలా మారింది. నిర్జీవంగా మారిన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవం పోసేందుకు అప్పట్లో యూ.పి.ఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ను ఏర్పాటు చేసింది. ఆ చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రయోజనాలకు అనేక అంశాలను పొందుపరచారు. ఆ చట్టానికి కేంద్రంలో అప్పటి ప్రతిపక్ష పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలియచేసింది. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రంలో ఉన్న అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ మద్దతు తో అప్పటి మన్ మోహన్ సింగ్ ప్రభుత్వం రూపొందించిన విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన అంశాలను మరియు ప్రత్యేక హోదా హామీని నెరవేర్చమని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాజ్యసభలో జరిగిన చర్చ సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అయిదు సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలిపింది. అదేసమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించి అయిదు సంవత్సరాలు సరిపోదు పది సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కేటాయించమని బిజెపి జాతీయ అగ్ర నాయకులు ముప్పవరపు వెంకయ్య నాయుడు రాజ్యసభలో మన్ మోహన్ సింగ్ ప్రభుత్వంను డిమాండ్ చేశారు.రాజ్యసభలో అప్పటి ప్రతిపక్ష పార్టీకి చెందిన భారతీయ జనతా పార్టీ అగ్ర నేత వెంకయ్య నాయుడి డిమాండ్ ప్రకారం రాష్ట్రానికి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా కేటాయించమని ప్రజలు ప్రస్తుత బిజెపి ఆధ్వర్యంలోని యన్.డి.ఏ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని ఆశాస్త్రీయంగా జరిగిన రాష్ట్ర విభజన వైనాన్ని స్వయంగా గతంలో నరేంద్ర మోడీ వెల్లడించారు. రాష్ట్ర విభజన వలన ఆంధ్రప్రదేశ్ ఘోరంగా నష్ట పోయిందనే విషయాన్ని మోడీ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అందుకు అనుగుణంగానే రాష్ట్రానికి డిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని, ప్రత్యేక హోదా కల్పించడంతో పాటూ విభజన హామీలన్నీ నెరవేర్చి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని 2014లో తిరుపతిలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజలకు గట్టి హామీ ఇచ్చారు.నరేంద్ర మోడీ గతంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరుని సాక్షిగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి విభజన హామీలు నెరవేర్చమని ప్రజలు మోడీ ని కోరుతున్నారు.రాష్ట్ర ప్రజల కోరికల ప్రకారం మరియి గతంలో రాష్ట్ర విభజన సమయంలో బిజెపి అగ్రనేతలు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి,విభజన చట్టంలోని హామీలను నెరవేర్చి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ఆదుకోవలసిన బాధ్యత ప్రస్తుత పరిస్థితులలో ప్రస్తుత నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఉందనేది నిర్వివాద అంశం. ప్రత్యేక హోదా అంశం విభజన చట్టంలో పొందుపరచకుండా అప్పటి కాంగ్రెస్స్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేసింది. యూ.పి.ఏ ప్రభుత్వం విభజన చట్టాన్నిరూపొందించే సమయంలో ఉభయ సభల్లో సుష్మా స్వరాజ్,ముప్పవరపు వెంకయ్య నాయుడులు బిజెపి తరపున కీలకంగా వ్యవహరించారు. వెంకయ్య నాయుడు, సుష్మా స్వరాజ్ లూ ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో పెట్టించే విషయంలో వైఫల్యం చెందడం బాధాకరం. చట్టంలో లేకపోవడంతో ప్రత్యేక హోదా అంశాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం అటకెక్కించాలని చూస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాష్ట్ర ప్రజలకు గతంలో తాను ఇచ్చిన హామీని మరియు రాష్ట్రానికి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా కావాలని రాజ్యసభలో అప్పటి బిజెపి జాతీయ అగ్రనేత వెంకయ్య నాయుడు పట్టుబట్టిన వైనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ విస్మరించడం ఆశ్చర్యకరం. ప్రత్యేక హోదా ఇవ్వలేని పక్షంలో 2016 లో ఇదే నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలిపిన విధంగా ప్రత్యేక హోదా ప్రకారం వచ్చే రాయితీలు కల్పించి రాష్ట్రానికి భారీ ప్యాకేజీ అయినా యుద్ధప్రాతిపదికన ప్రకటించాల్సిన బాధ్యత కచ్చితంగా నరేంద్ర మోడీ ప్రభుత్వానిదే. అదేవిధంగా విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన అంశాలన్నింటినీ వెంటనే నెరవేర్చవలసిన బాధ్యత ప్రస్తుత యన్.డి.ఏ ప్రభుత్వంపై అధికంగా ఉంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారా చంద్రబాబు నాయుడు మంచి పాలనాదక్షత కలిగిన వారనడంలో ఎటువంటి సందేహం లేదు.రాష్ట్రాభివృద్ధి విషయంలో నారా చంద్రబాబు నాయుడి చిత్తశుద్ధి శంకించలేనిది.అయినా విభజనతో అస్తవ్యస్తంగా తయారయిన రాష్ట్రంలోని వనరులు ఉపయోగించుకుని ఇప్పటికిప్పుడు సంపద సృష్టించి రాష్ట్రాన్ని గాడిన పెట్టడం సాధ్యమయ్యే పని కాదు. ఈ పరిస్తితిని ముందే గ్రహించిన కేంద్ర పెద్దలు 2014లో రాష్ట్ర పునర్విభజన చట్టం ఏర్పాటు చేసి అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పునర్జీవం కల్పించే అనేక అంశాలు పొందుపరచారు.ఈ విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో పొందుపరచిన అంశాలు కార్యరూపం దాల్చినప్పుడే రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాల సరసన చేరుతుంది.కనుక దేశంలో ఏ ఇతర రాష్ట్రం ఆధరించని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు,రాష్ట్రానికి చెందిన ఉభయసభల్లోని సభ్యులు ఆదరిస్తున్న పరిణామాన్ని పరిగణిలోకి తీసుకుని ఈపర్యాయమైనా గతంలో తానూ ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంతో పాటూ విభజన చట్టంలోని షెడ్యూల్ 13వ లో ఉన్న అంశాలు ప్రధాని నరేంద్ర మోడీ నెరవేరుస్తారని ఆశిద్దాం.

# రెండు దశాబ్దాల సమాచార హక్కు చట్టం

● ప్రభుత్వాలే కనీస సహకారం అందించని వైనం ● ఏళ్ల తరబడి కమిషనర్ల నియామకానికి శతబిషలు ● ఇరు తెలుగు రాష్ట్రాలలో పేరుకు పోతున్న స.హ. కేసులు ● ఉద్దేశ పూర్వకంగా నియామకాలు చేయని ప్రభుత్వాధినేతలు

ప్రతి ప్రభుత్వ ఆఫీసుల్లో సంస్థల్లో పారదర్శకత జవాబు దారి తనం పెంపొందించేందుకు అన్ని సంస్థల్లోని సమాచారం ప్రజలకు అందించే ముఖ్య ఉద్దేశంతో సమాచార హక్కు చట్టం 2005 ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చట్టం రావటంతో అంతకుముందు రహస్యంగా ఉంచబడిన సమాచారం, పత్రాలు, రికార్డులు చాలావరకు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ ఇంకా ఈ చట్టం సమర్థవంతంగా పగడ్బందీగా అమలు కాకపోవడంతో సమాచారం పూర్తిగా అందుబాటులోకి రావడం లేదన్నది వాస్తవం.

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 లో ఉద్దేశం, లక్ష్యాలను పొందుపరచడం జరిగింది. చట్టం వచ్చిన 120 రోజులలో ప్రతి కార్యాలయంలోని ప్రతి ప్రజా సమాచార అధికారి తమ కార్యాలయానికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలని ఈ సెక్షన్ చెబుతోంది. ప్రధానంగా సెక్షన్ 4(1)(బి) ప్రకారం సంస్థ నిర్వహిస్తున్న విధులు, ఆ సంస్థకు వస్తున్న నిధులు, అధికారాలు, సంస్థకు ప్రాతినిధ్యం వహించే అధికారులు, పనిచేసే ఉద్యోగుల వివరాలతో పాటు వారి జీత భత్యాలు సమాచారం ప్రతి ప్రజా సమాచార అధికారుల వద్ద అందుబాటులో ఉంచాలి. అలాగే దరఖాస్తు దారుకు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వడానికి తీసుకున్న చర్యలు, ప్రతిదానికి కేటాయించబడిన బడ్జెట్ వివరాలు, నిర్ణయాలు ఏ ప్రాతిపదికన తీసుకున్నారు, సంబంధిత పత్రాలు వివరాలు . లబ్ధిదారుల వివరాలు, ఎలక్ట్రానిక్ రూపం లో ఉంచిన సమాచారం వివరాలు అందులో ఉంచాలని ఈ సెక్షన్ చెబుతుంది. ఆ సెక్షన్ జవాబుదారీతనాన్ని నిర్దేశిస్తుంది. పైగా ఈ వివరాలు ప్రతి సంవత్సరం నవీకరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఈ వివరాలన్నీ ప్రజలు అవలీలగా తెలుసుకోవడానికి వీలుగా ఉంచాలని ఈ సెటన్ పేర్కొంది. దీంతో దరఖాస్తు పెట్టకుండానే సమాచారం యావత్తు ప్రజలు తెలుసుకొనే అవకాశం ఉంటుంది.



**- ఉడతనేని రామారావు**
**హైకోర్టు అడ్వకేట్**

వాస్తవానికి ఈ సెక్షన్ ప్రతి కార్యాలయంలో నిర్లక్ష్యానికి గురవుతోందని చెప్పక తప్పదు. అన్ని వివరాలతో దాదాపుగా ఏ ఒక్క ఆఫీసు కానీ సంస్థ కానీ లేదని చెప్పవచ్చు. ఈ సెక్షన్ లో చెప్పబడ్డ ప్రతి వివరం ప్రజలకు అందులో బాటులోకి తీసుకువస్తే ఏ ఆఫీసులో ఏం జరుగుతోంది, ఎక్కడ పనులు ఆగుతున్నాయి, ఎక్కడ అవినీతికి ఆస్కారం ఉంటుందో తెలుసుకొని తదుపరి చర్యలు చేపట్టవచ్చు. జవాబుదారీ ప్రభుత్వాన్ని తయారు చేసు కోవాలని ఈ చట్టాన్ని అమలు పరచాలని ప్రజలు కోరుతే. .. చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అయితే ప్రజలు ఈ సెక్షన్ ను అర్థం చేసుకుని దానిని అమలు చేయడానికి ముందడుగు వేసిన దాఖలాలు కనిపించడం లేదన్నది చేదు నిజం.

ప్రధానంగా ఈ చట్ట ప్రకారం ప్రతి ప్రభుత్వ ఆఫీసు, ప్రభుత్వ ఆధీనంలో, ప్రభుత్వ నిధులతో పనిచేసే ప్రతి సంస్థలోనూ సమాచారం ఇచ్చే అధికారులు వివరాలు, అప్పిలేట్ అధికారులు వివరాలు ఆ సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలి. సమాచారం కావాల్సిన వారు సదరు సమాచార అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన 30 రోజుల్లో సమాచారం ఇవ్వవలసి ఉంటుంది. అయితే దరఖాస్తుదారు ప్రాణానికి , స్వేచ్ఛకి సంబంధించిన అంశంపై సమాచారం 48 గంటల్లో ఇవ్వాలని చట్టం పేర్కొంది.




సమాచార అధికారి 30 రోజులలో సమాచారం ఇవ్వవలసి ఉంటుంది. లేదా ఆ దరఖాస్తు తిరస్కరించినచో అందుకు గల కారణాలను తెలపాల్సి ఉంటుంది. సమాచారం ఇవ్వకుండా తిరస్కరించినచో లేదా 30 రోజులు దాటిన తరువాత కూడా సమాచారం ఇవ్వని పక్షంలోనూ, అరకొరగా సమాచారం ఇచ్చినా.... దరఖాస్తుదారు గల హక్కు ఏమిటి అనే ప్రశ్న మొదలవుతుంది. పై కారణాలతోనే మొదటి అప్పిలేటు అధికారి కి అప్పీలు చేసుకోవాలి. అప్పిలేట్ అధికారి సరైన కారణాలు లేకుండా అని సమాచారం ఇవ్వలేదని భావిస్తే లేదా సమాధానం అరకొరగా ఇచ్చారని లేదా దరఖాస్తుదారు అడిగిన సమాచారం ఇవ్వలేదని భావించిన పక్షంలో పూర్తి సమాచారం ఇవ్వమని ఆదేశాలు జారీ చేయవచ్చు.

ఇక్కడ ఇంకొక అదనపు హక్కును దరఖాస్తుదారుకి సెక్షన్ 18 మరియు 20 కలిపిస్తోంది . అదేమిటంటే అప్పీలు చేసుకోవడంతో పాటు సరాసరిగా అదే సమయంలో రాష్ట్ర కమిషన్ కు ఫిర్యాదు కూడా చేసుకొనవచ్చు. ఇక్కడ గుర్తించవలసింది ఏమిటంటే కంప్లైంట్ , అప్పీలు కాదు. ఇది అపరాధ రుసుముతో శిక్షించ తగినది. ఇంకా సుస్పష్టంగా చెప్పాలంటే సమాచార అధికారి 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోయినా, కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా, సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వకపోయినా కమిషన్ రోజుకు 250 రూపాయలు చొప్పున 25 వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు . కావాలని సమాచారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టే, మొద్దు నిద్రపోయే సమాచార అధికారులకు ఈ సెక్షన్ సరైన సమాధానం అనే చెప్పాలి. ఈ సెక్షన్ గురించి సరైన అవగాహన లేకపోవడంతో దానిని ఉపయోగించిన దాఖలాలు బహు తక్కువగా ఉన్నాయి. అంతే గాక శాఖా పరమైన చర్యలు కూడా తీసుకొనమని కమిషనర్ ప్రభుత్వాన్ని ఆదేశించే అవకాశం ఉంది.

మొదటి అప్పీలు అధికారి దగ్గర న్యాయం జరగలేదని భావిస్తే రాష్ట్ర కమిషన్ కు రెండవ అపీలు దాఖలు చేసుకోవచ్చు. అక్కడ కమిషన్ విచారించి పైన చెప్పినట్టుగా తగిన కారణాలు సమాచార అధికారి చూపించకపోతే అపరాధ రుసుంగా రోజుకు 250 రూపాయలు చొప్పున విధించవచ్చు.

ఈ చట్ట ప్రకారం ప్రతి ఆఫీసు నందు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ఇచ్చే అధికారి పేరు, అప్పీలు అధికారి హోదా వివరాలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రైవేటు సంస్థలకు, కార్యాలయాలకు వర్తించదని గమనించాలి. ఇక సమాచారం ఇవ్వడానికి ఇష్టపడని అధికారులు డొంకతిరుడు సమాధానం, అనగా సదరు సమాచారం ప్రస్తుతం అందుబాటులో లేదు అని చెప్తారు. ఈ సమాధానం పట్ల కూడా సెక్షన్ 18 లేదా 20 కింద శిక్షా అర్హత ఉన్న తప్పిదమే

రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సమాచార కమిషన్ లో ఖాళీలను నింపడానికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానానికి వెళితే గాని ఆ ఖాళీలను భర్తీ చేయడం లేదు. దాంతో వేలాది రెండవ అప్పీళ్లు పరిష్కారం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. దీంతో దరఖాస్తుదారులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అర్థం అవుతుంది.

ఏది ఏమైనా ఇది ఒక గొప్ప చట్టం. అందులో సందేహం లేదు. ఈ చట్టాన్ని సక్రమంగా ఉపయోగించుకుని సమగ్ర సమాచారంతో ప్రభుత్వ విభాగాలలోని అవకతవకలపై చర్యలు తీసుకునే సదావకాశం ప్రజలకు కలుగుతుంది. ఈ చట్టం వచ్చి దాదాపు 20 సంవత్సరాలు అవుతున్న ప్రజలకు ఇందులోని ఉపయోగం గురించి పూర్తిగా అవగాహన కొరవడిందని చెప్పవచ్చు . వ్యక్తిగత గోప్యత మరియు దేశ రక్షణ కోసం సంబంధించిన విషయం పై ఈ చట్టంలో మినహాయింపులు ఉన్నాయన్నది గమనించదగ్గది.

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :**
**suryaeditpage@gmail.com**

**SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.**

# పోలీసులు సీఎం రేవంత్‌కు కొమ్ము కాస్తున్నారు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీజేపీయువమోర్చ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీకు అనుకూలంగా ఉన్న చానల్లో మీకు ప్రచారం చేయొచ్చు కానీ మీరు చేస్తున్న తప్పులను ప్రజలు లెక్కబెడుతున్నారు.
రేవంత్ రెడ్డి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. జి హుజూర్ అన్న అధికారులకు ఏ గతి పట్టిందో గుర్తుపెట్టుకోవాలి. పోలీసులు లాటిఛార్జి చేయవచ్చు కానీ ఐదేళ్ల తర్వాత ఓట్లు వేసేది పోలీసులు కాదు ఈ యువతరం. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన ఏ మాటనూ నిలబెట్టుకోలేదు. ఎన్నికలు వచ్చిన సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లడుగుతారు, ఇతర సమయాలలో కనిపించరు.
అధికారం ఉందని, పోలీసులను నమ్ముకుని యువతను దూరం చేసుకుంటే అధోగతి పాలవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. చిన్న చిన్న ఉద్యోగులు పైసా పైసా కూడబెట్టి స్థలాలు కొనుక్కుని ఇళ్లు కట్టుకుంటే 35 సంవత్సరాల తర్వాత వారి ఇళ్లు కూల్చివేయడం దారుణం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు వారి ఇళ్లను అధికార మదంతో కూల్చివేస్తున్నాడు.
ప్రజలకు మేలు చేసే పనులు చేస్తేనే ప్రజలు హర్షిస్తారు. అంతేకానీ పైన ఉన్న బాస్ ల మెప్పు కోసం పని చేస్తే ప్రజలు పాతరేస్తారు.
భారతీయ యువ మోర్చా 35 లక్షల మంది నిరుద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటుంది. నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలి. గ్రూప్ 2,3పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు.



## హైదరాబాద్‌లో 7కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్: రాజస్థాన్ నుంచి హైదరాబాద్కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని రాజస్థాన్కు చెందిన వ్యక్తులు, వ్యాపారవేత్తలే లక్ష్యంగా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. వారి నుంచి 1,250 గ్రాముల హెరాయిన్ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని తెలిపారు. నిందితులు నలుగురూ రాజస్థాన్కు చెందిన వారేనని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మీడియాకు వెల్లడించారు. హెరాయిన్ను చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బస్సుల్లో తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

### 30 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

హైదరాబాద్: చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 30 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ప్రకటించారు. వాటిలో క్లస్టర్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 8, టెక్స్టైల్ డిజైనర్ ఉద్యోగాలు 22 ఉన్నట్లు తెలిపారు. ఐఐహెచ్టీ నుంచి చేనేత టెక్నాలజీలో డిప్లొమో చేసిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు తాత్కాలిక పద్ధతిన మూడేళ్లపాటు పనిచేయాల్సి ఉంటుందని శైలజారామయ్యర్ స్పష్టం చేశారు.

# ఓడినా ఆ వైఖరి మారలేదు?

- కేంద్ర మంత్రి అమిత్ షా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మండిపడ్డారు
- పార్లమెంట్‌లో అహంకారం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు



రాంచీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వైఖరిపై కేంద్రమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఓడినప్పటికీ ఆయన మాత్రం పార్లమెంట్లో అహంకారం ప్రదర్శించారని ఆరోపించారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన పార్టీ మీటింగ్లో పాల్గొన్న అమిత్ షా.. రాహుల్పై విరుచుకుపడ్డారు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత కొందరు నాయకులకు అహంకారం పెరుగుతుందని ఇప్పటివరకు విన్నాను. ఝార్ఖండ్లోనూ అలాంటి వారే అధికారంలో ఉన్నారు. కానీ, అధికారంలో లేకపోయినప్పటికీ అహంకారం కలిగిన వ్యక్తిని మొదటిసారి చూస్తున్నా. పార్లమెంట్లో ఎన్నోసార్లు రాహుల్ గాంధీ అహంకారం ప్రదర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు గెలిచారో అందరికీ తెలిసిన విషయమే. కానీ, కొందరు ఓటమిని ఒప్పుకోలేకపోతున్నారు రాహుల్ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.
వాస్తవాన్ని అంగీకరించండి..
లోక్సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పూర్తి మెజారిటీ దక్కింది. ఇది ఇండియా కూటమికి దక్కిన స్థానాల కంటే ఎక్కువ. అలాంటప్పుడు వారికి ఎందుకింత అహంకారం?వరుసగా ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. కానీ, ఈ వాస్తవాన్ని అంగీకరించలేకపోతున్నారు అని షా దయ్యబట్టారు. జైలు నుంచి వచ్చిన అనంతరం మళ్లీ సీఎం పీఠమెక్కిన హేమంత్ సోరెన్పై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు.
నాతో సినిమానా.. కంగనా అస్సలే అంగీకరించరు: కేంద్రమంత్రి
వారిది అవినీతి ప్రభుత్వం..
హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో కెల్లా అత్యంత అవినీతిపరమైంది. మద్యం, భూకుంభకోణాలకు పాల్పడి రూ. కోట్లు కొల్లగొట్టారు అని ఆరోపించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.

## ఉక్రెయిన్ - రష్యాల యుద్ధాన్ని ముగిస్తా

### జెలెన్ స్కీకి ట్రంప్ హామీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో దూసుకెళ్తున్న డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. చర్చల ద్వారా రష్యా తో జరుగుతున్న ఘర్షణ ఆగేలా చూస్తానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కి డొనాల్డ్ ట్రంప్ భరోసా ఇచ్చారు. తమ మధ్య మంచి సంభాషణ జరిగిందని వెల్లడించారు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు."జెలెన్ స్కీ , నేను ఫోన్లో మాట్లాడుకున్నాం. రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సు విజయవంతమైనందుకు ఆయన నాకు అభినందనలు తెలిపారు. అలాగే నాపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు" అని తెలిపారు. నవంబర్లో జరిగే ఎన్నికల్లో గెలిస్తే జనవరిలో అధికారం చేపట్టకముందే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తానని ట్రంప్ వెల్లడించారు. 2022లో తాను అధికారంలో ఉండి ఉంటే, అసలు ఈ యుద్ధం జరిగేది కాదన్నారు. చర్చల ద్వారా యుద్ధాలను ముగించి, శాంతిని తీసుకువస్తానని తెలిపారు. జెలెన్ స్కీ కూడా ఈ ఫోన్కాల్ గురించి పోస్టు పెట్టారు. రష్యా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు అమెరికా అందిస్తోన్న సహకారంపై కృతజ్ఞతతో ఉంటామన్నారు. అయితే తమ నగరాలపై రష్యా దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. శాంతి చర్చలకు తాము సుముఖంగా ఉన్నామని తెలిపారు.

## 25న తెలంగాణ బడ్జెట్

### ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



తెలంగాణ బ్యూరోప్రతినిధి : ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచరంతో సమాధానాలు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సెషన్లో సమన్వయ లోపం గ్యాప్ లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనుంది. నోట్ ఆన్ డిమాండ్ రూపొందించి బడ్జెట్ను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శులు సందీప్కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, కార్యదర్శులు రఘునందనర్రావు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, వి కరుణ, లోకేష్ కుమార్, సిఐపిఆర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. సభ ప్రారంభమైన వెంటనే ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగం చేయనున్నారు. ఇక మండలి సమావేశాలు 24వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అసెంబ్లీ సెక్రటరీ ప్రకటన విడుదల చేశారు.

# ట్రంప్‌పై జరిగిన కాల్పులపై స్పందించిన జుకర్‌బర్గ్

### వ్యక్తిగత అభిప్రాయం అంటూ కామెంట్



వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై మెటా సీఈఓ మార్క్ జుకర్బర్గ్ ప్రశంసలు కురిపించారు. కాల్పుల సమయంలో ఆయన చూపిన తెగువ స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ట్రంప్పై కొద్ది రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం ఘటన యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. పెన్సిల్వేనియాలోని ప్రచార ర్యాలీలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ఆయన గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తాజాగా మెటా సీఈఓ మార్క్ జుకర్బర్గ్ స్పందించారు. మాజీ అధ్యక్షుడి ధైర్యాన్ని ప్రశంసించారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టంచేశారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.
ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రసంగిస్తుండగా యువకుడు కాల్పులు జరపగా.. ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి ఓ తూటా దూసుకువెళ్లింది. రక్తమోడుతున్న గాయంతో వేదికపై నుంచి దిగుతూ ట్రంప్ పిడికిలి బిగించి '..ఫైట్' (పోరాడండి) అని గట్టిగా నినదించారు. ఆయన వెనక అమెరికా జెండా కన్పించింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోపై జుకర్బర్గ్ స్పందిస్తూ.. "నా జీవితంలో చూసిన అత్యంత అరుదైన దృశ్యం అది. ఆ సమయంలో ఆయన చూపిన తెగువ చాలా స్ఫూర్తి కలిగించింది. ఒక అమెరికన్గా ఎవరైనా ఆ పోరాటంతో భావోద్వేగానికి గురి కావాల్సిందే. అందుకేనేమో చాలామంది ఆయనను ఇష్టపడతారు" అని మాజీ అధ్యక్షుడిని ప్రశంసించారు. అయితే, ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, రాజకీయాలతో దీనికి ఎలాంటి సంబంధం లేదని జుకర్బర్గ్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో వచ్చే ఎన్నికల్లో ఏ అభ్యర్థికి తాను మద్దతు ఇచ్చినట్లు కాదని తెలిపారు.
కాల్పుల ఘటన తర్వాత టెస్లా అధినేత ఎలాన్ మస్క్తో సహా చాలామంది ప్రముఖులు ట్రంప్నకు బహిరంగంగా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. కాగా.. ఇటీవల ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే టిక్టాక్ను నిషేధించనని, అలా చేస్తే మెటా ప్రయోజనం పొందుతుందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల వేళ జుకర్బర్గ్ ఆయనను ప్రశంసించడం ప్రాధాన్యం సంతరించుకుంది.
2021లో క్యాపిటల్ భవనంపై దాడి తర్వాత ట్రంప్ ఫేస్బుక్, ఇన్స్టా ఖాతాలో నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అనంతరం 2023లో వాటిని పునరుద్ధరించారు. అయితే భవిష్యత్తులో ట్రంప్ మళ్లీ ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానా విధిస్తామని మెటా అప్పుడు పేర్కొంది. అయితే, అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఆయన ఖాతాలపై ఆంక్షలను మెటా ఎత్తివేసింది.

## అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః రాజీవ్గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్లో పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. హైదరాబాద్ ప్రజాభవన్లో సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్రానికి చెందిన 41 మంది అభ్యర్థులతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందన్నారు. త్యాగాల వునాదులపై తెలంగాణ ఏర్పడిందని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు. అందుకే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని మార్పులు చేశామన్నారు. గ్రూప్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామని, ప్రస్తుత డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్–2 పరీక్ష వాయిదా వేశామని చెప్పారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెడుతామన్నారు. ఇక ప్రతీ ఏటా మార్చి నెలలోగా అన్ని శాఖల్లో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామని చెప్పారు. జూన్ 2లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సింగరేణి సంస్థను అభినందించారు. మెయిన్స్కు సన్నద్ధం కావడానికి ప్రభుత్వం పక్షాన ఆర్థిక సాయం అందించడం రాష్ట్ర చరిత్రలోనే ఇదే మొదటిసారని చెప్పారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమని, అంతా మెయిన్స్కు ఎంపిక కావాలని అభ్యర్థులకు సూచించారు.

# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత

- బంగ్లాదేశ్ నుంచి స్వదేశానికి 1000 మంది భారత విద్యార్థులు
- దేశమంతటా 144 సెక్షన్ అమలు
- బంగ్లాలో ఉద్రిక్తతకు దారితీసిన విద్యార్థుల ఆందోళనలు
- విదేశీ పర్యటన రద్దు చేసుకున్న ప్రధాని షేక్ హసీనా
- భారతీయులు సురక్షితంగా తిరిగొచ్చేందుకు విదేశాంగ శాఖ ఏర్పాట్లు



ఢాకా: రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో బంగ్లాదేశ్లో నెలకొన్న కల్లోల పరిస్థితులు నెలకొన్న వేళ పలువురు భారతీయ విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి తిరిగొస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని సంస్కరించాలంటూ బంగ్లాదేశ్లో విద్యార్థులు చేస్తోన్న ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న పలువురు భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది విద్యార్థులు వచ్చారు. వారిలో 778 మంది సరిహద్దు మార్గాల ద్వారా రాగా, మరో 200 మంది విమానాల్లో సొంత దేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. అంతర్జాతీయ సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్ చేరుకుంటున్న విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని సదుపాయాలు కల్పిస్తోందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నిమిత్తం పౌర విమానయాన శాఖ, సరిహద్దు భద్రతా దళంతో సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించింది. ఇప్పటికే దాదాపు 1000 మంది విద్యార్థులు స్వదేశానికి రాగా.. ఇంకా వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉన్న 4వేల మంది విద్యార్థులతో హై కమిషన్ కాంటాక్ట్లో ఉంది.ఆందోళనకారులు, పోలీసులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా మృతిచెందినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. సైన్యాన్ని రంగంలోకి దించారు. పలు చోట్ల పెద్దఎత్తున ఆర్మీ బలగాలను మోహరించారు. దాంతో విమాన టికెట్లు బుక్ చేసుకున్న వారు.. విమానాశ్రయాలకు చేరుకోవడం కష్టంగా మారింది. కర్ఫ్యూ నేపథ్యంలో కొన్ని సంస్థలు విమాన సేవల్ని రద్దు చేశాయి.ప్రస్తుత పరిస్థితుల వేళ.. బంగ్లా ప్రధాని షేక్ హసీనా అధికారిక విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆమె స్పెయిన్, బ్రెజిల్ వెళ్లాల్సి ఉంది. అలాగే ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఆమె చర్చలకు ఆహ్వానించారు.
ప్రస్తుత కోటా విధానం ప్రకారం.. 1971లో బంగ్లాదేశ్ విముక్త పోరాటంలో అశువులు బాసిన వారి పిల్లలకు, మనవళ్లు, మనవరాళ్లకు 30శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 10శాతం స్థానిక పరిపాలన జిల్లాల వారికి, 10శాతం మహిళలకు, 5శాతం మైనారిటీ తెగల వారికి, 1శాతం దివ్యాంగులకు ఇస్తున్నారు. ఈ పద్ధతిని సంస్కరించి.. ప్రతిభ ఆధారంగా మొదటి, రెండో శ్రేణి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండు చేస్తూ బంగ్లాదేశ్లోని ప్రధాన నగరాలైన ఢాకా, రాజ్షాహీ, ఖుల్నా, చత్తోగ్రాంలలో పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. దీనికి ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు నాయకత్వం వహిస్తున్నారు.

## ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్


### నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసింది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిది: నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి విమర్శించారు. హైదరాబాద్లోని ధర్నా చౌక్లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంతడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలన్నీ విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుంటోందని.. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా అవినీతి కొనసాగుతోంది. అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో మాత్రమే రాష్ట్రంలో మార్పు వచ్చింది. హామీలన్నీ వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్లో చేర్చుకున్నారు. రాష్ట్రంలో కేవలం జెండా మాత్రమే మారింది. ప్రజావాణి వినిపించడంలో భాజపా కృషి చేస్తుంది. గ్రూప్ 1 మెయిన్స్కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలి. 1365 గ్రూప్ 3 పోస్టులను 3000కు పెంచాలి. హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలి. మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు వెంటనే రూ.4 వేల భృతిని విడుదల చేయాలి అని కిషన్రెడ్డి డిమాండ్ చేశారు.

# 50వేల కోట్లతో మూసీ అభివృద్ధి

- భాగ్యనగరాన్ని పదేళ్లలో మరింత అభివృద్ధి చేస్తాం
- రూ.28.5 కోట్లతో గోపన్‌పల్లి ఫ్లై ఓవర్ నిర్మించాం
- శేరిలింగంపల్లిలో చెరువులను కాపాడతాం
- భాగ్యనగరం నుంచే తెలంగాణాకు 65శాతం ఆదాయం
- గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: హైదరాబాద్ను విశ్వనగరంగా చేస్తామని ముఖ్యమంత్రి రేవంతడ్డి తెలిపారు. వచ్చే పదేళ్లలో భాగ్యనగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. గోపనపల్లి ఫ్లైఓవర్ను సీఎం రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. దీంతో నగరవాసులకు మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. రూ. 28.5 కోట్లతో గోపన్పల్లి ఫ్లైఓవర్ను తెలంగాణ ప్రభుత్వం నిర్మించింది. ఫ్లైఓవర్ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలో చెరువులను కాపాడుతామని అన్నారు. శేరిలింగంపల్లిని ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణకు 65 శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తుందని అన్నారు. ఎక్కడ నుంచి వచ్చిన వారినైనా హైదరాబాద్ హక్కున చేర్చుకుటుందని చెప్పారు. ఓఆర్ఆర్ వరకు సమస్యల పరిష్కారం, అభివృద్ధి చేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని వివరించారు. రూ. లక్ష 50 వేల కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి చేశామని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వునాదులు వేస్తే... దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి అభివృద్ధి చేశారని తెలిపారు. తాము ఇంకా హైదరాబాద్ను అభివృద్ధి చేస్తామని వివరించారు. గతంలో మూసీ అంటే ముక్కు మూసుకునేవారని... మూసీ అంటే విదేశీ పర్యటకులు వచ్చి చూసే లా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఐటీ అంటే ఒక ముఖ్యమంత్రి, ఎయిర్ పోర్ట్ అంటే ఇంకో ముఖ్యమంత్రి గుర్తుకు వస్తారని చెప్పారు. ప్రజాప్రభుత్వం అంటే గుర్తుకు వచ్చేలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంతడ్డి పేర్కొన్నారు

## మహిళల ఉచిత బస్సు సౌకర్యాలను మెరుగుపరచాలి

### ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ


తెలంగాణ బ్యూరో ప్రతినిధి; రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో వసతులు మరికొన్ని కల్పించాలని ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ ప్రభుత్వాన్ని కోరారు. బస్సుల కొరకు మహిళలు గంటల తరబడి రోడ్లపై నిలబడి ఉండాల్సి వస్తుందని, దూర భారం ప్రయాణం చేసే వారికి సకాలంలో ఎక్స్ ప్రెస్ బస్సులు లేకపోవడంతో 5,6 గంటల పాటు రోడ్డుపై నిలబడి ఉంటే వారు అనేక ఇబ్బందులు పడాల్సివస్తోంది.అంతే కాకుండా బస్సులలో ప్రయాణంచేసే వురుషుల నుండి వత్తిడి,ఇతర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రూట్ లలో ఎక్కువగా డీలక్స్, సూపర్ డీలక్స్ సర్వీసులు తిరుగు తున్నా వాటికి అవకాశంలేకపోవడం తోనిస్సహాయస్తితిలో పలుఇబ్బందు లకు గురవుతు మహిళలు తీవ్ర ఆవేదనతో బాధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా తమ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలో కి వచ్చిన తర్వాత ఉచిత బస్సు సౌకర్యం అమలులోకి తీసుక వచ్చింది.ఇందు వల్ల ఆర్థిక భారం పడినా, ఇబ్బందులు వచ్చిన వెనుకాడకుండా మహిళల ప్రయోజనం కొరకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం సంపూర్ణంగా ఉపయోగపడాలని అందరు కోరు కుంటున్నారు.ఆర్టిసి ప్రజలకు నిజంగా సేవచేసే రంగమని ఈ స్ఫూర్తితోనే ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని భావిస్తున్నారు.కొద్ది మంది బడా కార్పొరేట్ శక్తులకు లక్షలకోట్ల రూపాయలు అప్పులు రద్దుచేసి రాయితీలు ఇస్తున్న పాలకులు కోట్లాది మంది ప్రజల కోసం ఉచిత బస్సు సౌకర్యం అందించడం అసాధ్యం ఎంత మాత్రం కాదు.ఇది లాభాల సమస్యగా చూడకుండా ప్రజా ప్రయోజనాల అంశంగా భావించాలి.ఇందులో తలెత్తుతున్న కొన్ని ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించవలసిన బాద్యత ప్రభుత్వంపై ఉంది. మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి సంపూర్ణంగా మహిళలకు ఉపయోగపడేలా చూడాల్సిన అవసరం ఉంది.ఇందుకు హైదరా బాద్–సికింద్రాబాద్ జంట నగరాల తో పాటు రాష్ట్రంలో అన్ని పట్టణా లలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికు లకు అవసరమైన పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీసులను పెంచాలి.



# పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టండి

### అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, ఎన్సీసీపై బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. సాంస్కృతిక సారథి కళాకారులు గత ఏడు నెలలుగా ఏ విధులు నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం ఆరా తీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదు.. వారి సేవలు వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసింది.. ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది.. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయండి, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడా మైదానాలు ఉన్నాయి.. వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయి.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి మైదానాలను ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడా మైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్‌లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కల్చర్ అంటే ఆటలు, పాటలు అనుకుంటున్నారు.
కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలా మందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు.. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్టులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. రాష్ట్రంలో సంస్కృతి, వారసత్వ సంపదలు ఘనంగా ఉన్నా.. ఆ మేరకు వాటిని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు దృష్టి సారించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు.



# తెలంగాణ వైద్యాధికారుల పనితీరు ప్రశంసనీయం

### హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

న్యూఢిల్లీ, బ్యూరో ప్రతినిధి: తెలంగాణ ఆరోగ్యశాఖ అధికారుల పనితీరుకు ముగ్ధులయిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం ఫోన్లో వారిని అభినందించి ప్రోత్సహించారు. దినపత్రికల ద్వారా డిఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అంకితభావంతో కూడిన పనితీరును గవర్నర్ దత్తాత్రేయ తెలుసుకున్నారు. 11 గిరిజన కుటుంబాలకు మందులు, దోమతెరలు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేందుకు ములుగు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అల్లెం అప్పయ్య 16 కిలోమీటర్లు కాలినడకన వాజేడు మండలంలోని మారుమూల గ్రామానికి వెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకుని ఎంతో సంతోషించిన గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు డిఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య తో ఫోన్లో మాట్లాడి, ఆయన విధినిర్వహణను మెచ్చుకుని, ఉజ్వల భవిష్యత్తుకు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

తన అనుభవాన్ని ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య ఫోన్లో గవర్నర్ కు వివరించారు. తన ప్రయాణంలో, వేగంగా ప్రవహించే నదిని దాటి, కొండలు ఎక్కి, రాళ్లను నావిగేట్ చేసి, ఐదు గంటలకు పైగా కాలినడకన 16 కిలోమీటర్లు ప్రయాణించి మారుమూల గ్రామానికి చేరుకున్నట్లు గవర్నర్కు తెలియజేశారు. గుత్తి కోయ గిరిజనుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేయడంతోపాటు మైదాన ప్రాంతాలకు వెళ్లేలా వారిని ప్రోత్సహించేందుకు ఈ కఠోర యాత్రను చేపట్టినట్లు అప్పయ్య గవర్నర్కు వివరించారు.

వారి జీవన స్థితిగతులు మరియు రోజువారీ సవాళ్లను అర్థం చేసుకోవడానికి, జూలై 16న పెనుగోలు గ్రామంలోని తండాలో రాత్రి గడిపినట్టు తెలిపారు. ఆ కుటుంబాలు అక్కడే ఉండడం ప్రమాదకరమని, వారికి వైద్య సదుపాయాలు కల్పించడం చాలా కష్టం అని తాను తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ వర్షాకాలంలో ఒక గ్రామం కంటే చిన్న స్థావరం అయిన తాండాలో 39 మంది నివసిస్తున్నార ని, వీరిలో రెండేళ్లలోపు పిల్లలతో సహా, అక్కడే ఉండేందుకు వారు ఆసక్తిగా ఉన్నారని డిఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య తెలిపారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

● రెండు రోజుల పాటు హస్తినలో మకాం ● ఢిల్లీకి సీఎం రేవంత్.. ప్రధాన అజెండా అదే..!
● మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అగ్రనేతలతో చర్చలు ● కేంద్ర మంత్రులతో భేటీ కానున్న రేవంత్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆది, సోమవారాల్లో ఆయన హస్తినలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రేంవత్ రెడ్డి ఢిల్లీ చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో పాటు.. పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణతో పాటు కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హైకమాండ్తో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పదవుల పంపకం పూర్తవ్వడంతో.. మిగిలిన పదవులు ఎవరెవరికి కేటాయించాలి.. పదవులు దక్కని సీనియర్లను ఎలా గౌరవించాలనే విషయంపై కూడా అధిష్టానంతో రేవంత్ చర్చించనున్నారు. మరోవైపు వరంగల్లో ఏర్పాటుచేయబోయే భారీ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ అమలు చేయడంతో రాహుల్తో సభ పెట్టిస్తే బాగుంటుందనే ఉద్దేశంలో రాష్ట్ర నాయకులు ఉన్నారు. ఈ విషయాన్ని హైకమాండ్కు రేవంత్ తెలియజేయనున్నారు. రెండు రోజుల పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. విభజన హామీల అమలుతో పాటు.. కొత్త రుణాలు, ప్రాజెక్టుల మంజూరుపై వివిధ శాఖల మంత్రులతో సమావేశమవుతారు. రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసే అవకాశం ఉంది. మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించనున్నారు. పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని కోరనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేతో పాటు రాహుల్ గాంధీని కలవనున్నారు. పార్టీకి సంబంధించిన అంశాలపై ఆయన చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తుండటంతో మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్తో చర్చించి.. ఎవరిని కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకోవాలనేదానిపై రేవంత్ చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించడంతో పాటు.. చేరికల అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పీసీసీ చీఫ్ ఎంపికపై ప్రస్తుత ఢిల్లీ పర్యటనలో క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. గత ఢిల్లీ పర్యటనలోనే పీసీసీ చీఫ్ ఎంపికపై ఓ నిర్ణయానికి వచ్చినప్పటికీ.. పార్టీలో ఏకాభిప్రాయం రాకపోవడంతో పీసీసీ చీఫ్ ఎంపిక వాయిదాపడింది. ఈసారి మాత్రం కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

## ఈ నెల 25న తెలంగాణ
# మంత్రి మండలి సమావేశం

### బడ్జెట్కు మంత్రిమండలి ఆమోదముద్ర



తెలంగాణ బ్యూరోప్రతినిధి ఈ నెల 25న తెలంగాణ మంత్రిమండలి సమావేశం కానున్నది. అసెంబ్లీ కమిటీ హాలులో ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి రేవంతడ్డి అధ్యతన సమావేశం జరుగనున్నది. భేటీలో బడ్జెట్కు మంత్రిమండలి ఆమోదముద్ర వేయనున్నారు. ఈ నెల 23 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇక బడ్జెట్ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఆయాశాఖల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు సంబంధించిన త్వరితగతిన సమాచారంతో సమాధానాలు పంపాలని ఆదేశించారు. బడ్జెట్ సమావేశాల్లో సమన్వయం లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. వార్షిక బడ్జెట్ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృాఎష్ణారావు తెలిపారు. ఆ తర్వాత రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరుగుతుందని.. నోట్ ఆన్ డిమాండ్ రూపొందించి బడ్జెట్ను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. అనంతరం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృాఎష్ణన్ ప్రసంగం చేయనున్నారు. మండలి సమావేశాలు 24న మొదలవనున్నాయి. ఇందుకు సంబంధించి అసెంబ్లీ సెక్రటరీ ప్రకటన విడుదల చేశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా దంచికొడుతున్న వానలు

● గోదావరికి పోటెత్తుతున్న వరద..భద్రాచలంలో పెరుగుతున్న నీటిమట్టం ● ములుగు జిల్లాలో అత్యధికంగా 109 మి.మీ. వర్షపాతం నమోదు ● పొంగుతున్న వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలు జలమయం
● ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



తెలంగాణ బ్యూరోప్రతినిధిః రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న కుండపోత వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. నిన్న రాత్రి నుంచి వర్షం కురుస్తోనే ఉంది. అయితే ఈ వారాంతంలో తెలంగాణ రికార్డు వర్షపాతాన్ని నమోదు చేసింది. ఇవాళ, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం.. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం, మహబూబ్నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మి.మీ. వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే 18 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా..భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుపోతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 31.5 గా ఉంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేశారు. మరోవైపు తాళిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన తాళి పేరు ప్రాజెక్టు, పెరూరు వైపు నుంచి వరద నీరు రావడంతో నది నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు జాలారులు నదివైపు వెళ్లొద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరికలు జారీ చేశారు.

**శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద..**

నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టు 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1066.30 అడుగులుగా ఉంది. ఎస్సారెస్పీ నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలు అయితే వరద ప్రవహానికి ప్రస్తుతం 17.662 టీఎంసీలుగా ఉంది

# స్టాఫ్ నర్సుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) విభాగంలో స్టాఫ్ నర్సుల బదిలీల ప్రక్రియపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రావు స్పందించారు. ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీలే కాదు.. ఇప్పుడు స్టాఫ్ నర్సులు కూడా రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసే దుస్థితిని కాంగ్రెస్ పార్టీ కల్పించింది అని హరీశ్రావు మండిపడ్డారు. బదిలీల ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, తమకు అన్యాయం జరుగుతున్నదని స్టాఫ్ నర్సులు రెండు రోజులుగా తమ కుటుంబాలను వదిలి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని హరీశ్రావు ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా? గుర్తింపు లేదా? ప్రభుత్వం తక్షణమే స్పందించి స్టాఫ్ నర్సుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్రావు పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) విభాగంలో నర్సింగ్ బదిలీల ప్రక్రియ రసాభాసగా మారింది. కౌన్సెలింగ్లో అక్రమాలు జరిగాయంటూ వందల మంది నర్సులు శుక్రవారం రాత్రి కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు రాస్తారోకో నిర్వహించారు. డీపీహెచ్ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే నిరసన తెలిపారు. హెల్త్ మినిస్టర్ రావాలి.. మాకు న్యాయం చేయాలి అంటూ నినాదాలు చేశారు. లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి పలువురి పేర్లు మాయమయ్యాయని, అర్హత లేని, బయటి సంఘాల నుంచి వచ్చిన సిఫారసు లేఖలను తీసుకొని కొందరిని రిటెయిన్ చేశారని, ఒక్కో బదిలీకి రూ. లక్షల్లో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. రాత్రి వరకు నర్సుల ఆందోళన కొనసాగింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నర్సులకు సర్దిచెప్పేందుకు డీపీహెచ్ రవీందర్నాయక్ మెడికల్ కాలేజీకి రాగా.. నర్సులు ఆయనను ఘెరావ్ చేసి నిలదీశారు. తమకు న్యాయం చేసేవరకు కౌన్సెలింగ్ నిర్వహించొద్దంటూ వాదించారు.

# తెలంగాణ ఉన్నత పాఠశాలల్లో పనివేళల మార్పు



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఉన్నత పాఠశాలల్లో పనివేళల మార్పు ఉంటాయని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సమయాలతో సమానంగా హైస్కూల్ వేళలను ఉదయం 9.30 నుండి సాయంత్రం 4.45కి బదులుగా ఉదయం 9.00 నుండి సాయంత్రం 4.15 వరకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో స్కూల్ యాజమాన్యం సోమవారం నుంచి పనివేళలు మార్పులు చేర్పులు ఉంటాయని వెల్లడించింది. పిల్లల తల్లిదండ్రులకు ఈ విషయాన్ని సూచించింది. సోమవారం నుంచి పాఠశాల పనివేళల మార్పులు ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో బోనాలు, ఒకవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు.. మరోవైపు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ట్రాఫిక్ రద్దీ దృాఎష్ట్యా ప్రస్తుతం అమలు చేస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ట్రాఫిక్ రద్దీ దృాఎష్ట్యా ఉదయం 8.45 నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రస్తుతం అమలు చేస్తున్న స్కూల్ టైమ్స్ కొనసాగుతాయని వెల్లడించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంలో పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో.. గోవా, కర్నాటక, కేరళలోని అన్ని స్కూల్స్, కాలేజీలకు సెలవులను ప్రకటించిన విషయం విదితమే కాగా.. మరో రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి.. కొన్ని జిల్లాలో కుండపోత వర్షంతో జనజీవనం అతలాకుతలం అవుతుంది.. మరికొన్ని జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి.. ఈ నేపథ్యంలో.. ఏపీలోని పలు జిల్లాల్లో నిన్న స్కూళ్లకు, కాలేజీలకు సెలవు ప్రకటించిన విషయం విదితమే కాగా.. ఈ రోజు.. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం.. ఎన్టీఆర్, కృాఎష్ణా జిల్లా, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు అధికారులు.. ఎన్టీఆర్ జిల్లాలో పాఠశాలలకు నేడు సెలవు ప్రకటించింది విద్యాశాఖ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సెలవు ఇస్తున్నట్టు డీఈవో ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్కు ఫిరాయింపులే అస్త్రం

● అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ను నిలదీయనున్న గులాబీ సేన
● ఎదురు దాడికి రేవంత్ సర్కార్ సై ● అసెంబ్లీ సమావేశాలపై ప్రజల ఆసక్తి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో ఈ నెల 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. ఈ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్ను ఏ పాయింట్ మీద ఇరకాటంలో పెట్టాలన్నది బీఆర్ఎస్కు తలనొప్పిగా మారిందనే చెప్పాలి. సీఎం రేవంత్ ఎప్పటికప్పుడూ బీఆర్ఎస్ కౌంటర్లకు అడ్డుకట్ట వేస్తుండటంతో ఆ పార్టీకి ప్రశ్నించేందుకు ఓ టాపిక్ దొరకని పరిస్థితి తలెత్తింది. దీంతో పార్టీ ఫిరాయింపులనే ప్రధాన అస్త్రంగా చేసుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోందని తెలిసింది. ఇన్ని రోజులూ రుణమాఫీ గురించి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ప్రశ్నించింది. కానీ ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల ఆరంభాని కంటే ముందే రేవంత్ సర్కారు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి బీఆర్ఎస్ను దెబ్బకొట్టింది. ఇక నిరుద్యోగుల ఆందోళన గురించి బీఆర్ఎస్ ప్రస్తావించాలనుకుంది. కానీ మరో డీఎస్సీ వేస్తామని చెప్పి డీఎస్సీ అభ్యర్థులను రేవంత్ సర్కారు శాంతింపజేసింది. గ్రూప్-2ను వాయిదా వేయడంతో పాటు పోస్టుల పెంపుపైనా చర్చిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సభలో కాంగ్రెస్ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్కు పెద్దగా పాయింట్లు దొరకడం లేదు. అందుకే పార్టీ ఫిరాయింపులను ప్రధానంగా ప్రస్తావించనుందని సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరవున గెలిచిన వాళ్లలో 10 మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్లోకి వెళ్లిపోయారు. ఈ విషయంపై బీఆర్ఎస్ చర్చించే ఆస్కారముంది. అయితే గతంలో ఫిరాయింపులపై ప్రత్యర్థి పార్టీల నుంచి ప్రశ్నలు ఎదుర్కొన్న బీఆర్ఎస్.. ఇప్పుడు అదే అంశంపై ప్రశ్నించబోతుండటం కాస్త విడ్డూరమే. మరోవైపు నిరుద్యోగ భృాఎతి సహా పెండింగ్లో ఉన్న హామీల గురించి కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ప్రశ్నించే అవకాశముంది.

# ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందిస్తాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృాఎషి చేస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలతో పాటు ఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన ఆర్టీసీ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తార్నక ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. సిబ్బందికి అందిస్తోన్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతకముందు ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

# జనసేనను పటిష్టం చేస్తాం : ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో జనసేన న పటిష్టం చేస్తామని జనసేన రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మల్కాజ్ గిరి పార్లమెంటరీ, శేర్లింగంపల్లి నియోజకవర్గం ఐటీ విభాగం నాయకులతో సమావేశం. ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అధ్వర్యంలో వారి నివాసం వద్ద జనసేన నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం పై అవగాహన సదస్సు మరియు సభ్యత నమోదు కొరకై కార్యచరణ గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ సభ్యత్వం యొక్క ప్రాముఖ్యత మరియు దాని వల్ల వచ్చే ప్రయోజనాలు వివరించడం జరిగింది. అదేవిధంగా ఈ సభ్యత్వాన్ని తెలంగాణ రాష్ట్ర మొత్తం ఏవిధంగా తీసుకువెళ్లాలి తద్వారా తెలంగాణలో మన జనసేన పార్టీ బలపడుతుంది అని సూచించారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్లి వీలైనంత ఎక్కువ సభ్యత్వాలు చేయాలని సూచించారు. అనంతరం ఐటి కోఆర్డినేటర్ మిరియాల శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఉపయోగించిన అప్లికేషన్ కంటే కొత్తగా రూపొందించిన సభ్యత్వ అప్లికేషన్ బాగా సులభతరమైనది చెప్పారు. అలాగే పార్టీ క్రియాశీల సభ్యత్వం చేసిన ప్రతి ఒక్కరిని కూడా గౌరవిస్తుందని చెప్పారు. అనంతరము జనసేన పార్టీ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి మండలి దయాకర్ , కుత్బుల్లాపూర్ జనసేన పార్టీ ఇంచార్జ్ నందగిరి సతీష్ , శేర్లింగంపల్లి ఇంచార్జ్ డాక్టర్ మాధవరెడ్డి, కాకుమాను లక్ష్మణ్ రావు పార్టీ బలోపేతంకై తమ అభిప్రాయాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినిటి ప్రసాద్, వేముల మహేష్ , అడబాల షణ్ముఖ , వులగం సుబ్బ , ఆవుల రంగబాబు , నూకల మల్లేశ్వరరావు , పసువులేటి ప్రసాద్ , వీర మహిళలు హిందూమతి , ద్రాక్షాయిని, జన సైనికులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రాజ్యాంగంపై దాడి

● కేసీఆర్ ఆదేశాల మేరకు రాజ్ భవన్కు వెళ్లాం ● ఫార్టీ ఫిరాయింపులపై గవర్నర్కు వివరించాం ● నిరుద్యోగుల అంశంపై చర్చించాం ● రాష్ట్రంలో జరుగుతున్న విధానంపై రాష్ట్రపతిని కలుస్తాం ● గవర్నర్ రాధాకృష్ణన్కు వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు





తెలంగాణ బ్యూరోప్రతినిది: రాష్ట్రంలోని నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై రాజ్భవన్లో గవర్నర్ రాధాకృాఎష్ణన్కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. గవర్నర్తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజ్యాంగం మీద జరుగుతున్న దాడిని వివరించి చెప్పేందుకు కేసీఆర్ ఆదేశాల మేరకు గవర్నర్ను కలిశామని కేటీఆర్ తెలిపారు. రెండు ముఖ్యమైన అంశాలను గవర్నర్ దృాఎష్టికి తీసుకెళ్లాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను గవర్నర్కు తెలియజేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతూ.. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు చేసి కేసు పెడుతున్నట్లు చెప్పాం. విద్యార్థులపై లాఠీలు ఝులిపిస్తూ.. భయానక వాతావరణం సృాఎష్టించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను యూనివర్సిటీల్లో చూస్తున్నామని కేటీఆర్ తెలిపారు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి ప్రకటనలు ఇచ్చారని గవర్నర్ దృాఎష్టికి తీసుకెళ్లాం. కేసీఆర్ హయాంలో జారీ అయిన గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు రద్దు చేసి పోస్టుల సంఖ్య పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తు చేశామన్నారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని గవర్నర్కు చెప్పామని కేటీఆర్ తెలిపారు. మెగా డీఎస్సీ అని చెప్పారు కానీ వేయలేదు. నిరుద్యోగ భృాఎతి 4 వేలు ఇవ్వలేదు. అన్నింటికి మించి సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులను బయటకు ఈడ్చుకొచ్చి హింసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ ఉన్న విద్యార్థులపై దాడులు చేసి అప్రజస్వామికంగా వ్యవహరించారని వివరించి చెప్పాం. హోం సెక్రటరీని పిలుచుకుని అడుగుతానని, విద్యార్థులపై దాడులు చేయడం సరికాదని గవర్నర్ అన్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

రెండోది.. ఈ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో న్యాయం పోరాటం చేస్తున్న విషయాన్ని, స్పీకర్ను కలిసి అభ్యర్థించిన విషయాన్ని గవర్నర్కు తెలియజేశాం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి.. కాంగ్రెస్ టికెట్పై పార్లమెంట్కు పోటీ చేశారు. ఈ పార్టీ ఫిరాయింపుల విషయంలో తప్పకుండా నా పరిధిలో ఉన్నంత వరకు న్యాయం చేస్తానని గవర్నర్ చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రోటోకాల్ విషయంలో జరుగుతన్న అగౌరవాన్ని కూడా వివరించాం. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాస్తానని గవర్నర్ చెప్పారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా చూస్తానని చెప్పారు. భవిష్యత్లో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృాఎష్టికి తీసుకురావాలని గవర్నర్ చెప్పారు. ఇక్కడితో ఆగకుండా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండే పెద్దలను కలిసి కాంగ్రెస్ పార్టీ నిర్వాకాన్ని వివరిస్తాం. రాష్ట్రపతిని కూడా కలిసి చెబుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే వరకు, గ్రూప్-2, 3 పోస్టులు పెంచేదాకా, నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, నిరుద్యోగులకు అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు

**కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనానికి మేడిగడ్డనే సాక్ష్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనానికి మేడిగడ్డ బ్యారేజీనే సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజ్భవన్లో గవర్నర్ సీపీ రాధాకృాఎష్ణన్ను కలిసి పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడిన అనంతరం మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఉన్న ప్రస్తుత పరిస్థితిపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు ఈ విధంగా బదులిచ్చారు. మేడిగడ్డ కొట్టుకు పోయిందని.. కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగ పాలైందని చెప్పి చిల్లర మాటలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ ఇవాళ సిగ్గుతో తల దించుకోక తప్పదు. మేము మొదటి నుండి ఒక్కటే చెప్పినం.. అక్కడ జరిగింది చిన్న విషయమే పెద్దది కాదని చెప్పాము. ఈ రోజు ప్రాణహిత, గోదావరి నుంచి వరద నీరు వచ్చిన కూడా తట్టుకొని మేడిగడ్డ నిలబడటమే కాళేశ్వరం ప్రాజెక్ట్ యొక్క గొప్పతనానికి సాక్ష్యమని చెప్పక తప్పదు. మేడిగడ్డను త్వరలో సందర్శిస్తాం.. విజువల్స్ తీసుకు వచ్చి ప్రజలకు వివరంగా చెప్తామని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎక్స్ అఫీషియల్ హ్యాండిల్లో కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు.. నిండు కుండలా మేడిగడ్డ బ్యారేజీ అంటూ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద వీడియోను పోస్టు చేసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయింది. కాళేశ్వరం కొట్టుకుపోయింది అని కాంగ్రెస్ పార్టీ, వందల కొద్దీ యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా.. వాళ్ల కుళ్లు, కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెకుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలను చూసి ఓర్వలేని సన్నాసులు ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార. కేసీఆర్పై, కాళేశ్వరం మీద బురదజల్లే ప్రయత్నం ఎవరు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయం. జై తెలంగాణ అంటూ కేటీఆర్ నిన్న పోస్టు చేశారు

# ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం

● ఇచ్చిన హామీలు మరిచిపోయారు ● పునాది పడని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
● రేషన్ కార్డులు ఇంకెప్పుడు ఇస్తారు ● హామీలు అమలు చేసేంతవరకు పోరాటం చేస్తాం ● జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి ప్రచార ఆర్భాటానికే పనిచేస్తుందని జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి అధ్యక్షతన క్రిస్టల్ గార్డెన్ లో జరిగింది . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చి కొన్ని మాత్రమే అమలు చేసి మిగిలిన హామీలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఈ రాజకీయ తీర్మానం, మహిళా తీర్మానం, వునాది పడని ఇందిరమ్మ జిల్లా తీర్మానం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమస్యలపై తీర్మానం, రేషన్ కార్డులపై తీర్మానం, ఈ తీర్మానాలు బలపరచడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. రవి కుమార్ యాదవ్ ,పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ కార్పొరేటర్ సురభి రవీందర్ రావు, నరేష్, నరేందర్ రెడ్డి, కన్వీనర్ రాఘవేందర్ రావు, కన్వీనర్ మణిభూషణ్, బిజెపి జిల్లా కార్యదర్శి చెన్నమనేని స్రవంతి, నవత ,భాస్కర్ రెడ్డి, కేశవరావు, రామరాజు, బి. అశోక్, బుచ్చిరెడ్డి, భాస్కర్, కాంచన, కమలాకర్ రెడ్డి, నర్సింగ్, భూపాల్ రెడ్డి, నవీన్, ,పద్మ, వినయ,విజయలక్ష్మి, వరలక్ష్మి, గీత,డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కాంటెస్టెడ్ కార్పోరేటర్లు, కార్పొరేటర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా పదాధికారులు, జిల్లా వివిధ మోర్చాల మరియు విభాగాల (సెల్స్) నాయకులు, రాష్ట్ర మోర్చల వివిధ విభాగాల (సెల్స్) నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ పార్లమెంట్ దిశగా అడుగులు

## సంచలనంగా మారుతున్న రష్యా అధ్యక్షుడి పుతిన్ ప్రకటన

## అన్ని దేశాలలో ఒకే తరహా కరెన్సీకి యోచనలు



**బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో రష్యా అ్యధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలిక్కిపడింది. ఆ కొత్త సంస్థ యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా అన్న ప్రశ్న ఉత్పన్నమయ్యింది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్కు పోటీయా అన్నట్లు ఇప్పటికే బ్రిక్స్ బ్యాంక్ ఏర్పడింది. బ్రిక్స్ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మారకాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీలలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళ ధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి.**

## 2014లోనే బ్రిక్స్ బ్యాంక్




ఇదంతా చాలదన్నట్లు, ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసే పరిణామాలు మరికొన్ని జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్కు పోటీయా అన్నట్లు బ్రిక్స్ బ్యాంక్ ఒకటి 2014 లోనే ఏర్పడింది. అమెరికన్ డాలర్ ప్రాబల్యాన్ని అరికట్టేందుకు బ్రిక్స్ కరెన్సీ అయితే ఇంకా రూపొందలేదు గానీ, బ్రిక్స్ దేశాలకు చెల్లింపుల కోసం బ్రిక్స్ చెయిన్ పేరిట ఒక సాధనం చలామణీలోకి వచ్చింది. అట్లాగే ఈ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మార కాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీ లలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. బ్రిక్స్ బ్రిడ్జ్ పేరిట మరొక చెల్లింపుల పద్ధతి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటన్నింటి ప్రభావాలతో పాశ్చాత్య ప్రపంచపు ఆర్థిక ప్రాబల్యం, పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్యం క్రమంగా బలహీనపడుతున్నాయి. ఉదాహరణకు ప్రస్తుత సంవత్సరంలో బ్రిక్స్ సగటు అర్థికాభివృద్ధి 3.6 శాతం మేర, జీ-7 దేశాలది కేవలం 1 శాతం మేర ఉండగలవని అంచనా. ప్రపంచంలో ఇప్పటికే రెండో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారిన చైనా మరొక దశాబ్దం లోపలే అమెరికాను మించగలదన్నది అంతటా వినవస్తున్న మాట. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళ ధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి. ఈ శతాబ్దం ఆసియా శతాబ్దం కాగలదనే జోస్యాలు ఆ విధంగా బలపడుతున్నాయి. చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో అమెరికా ఒత్తిళ్లను కాదని ఇప్పటికి 150 దేశాలు చేరటం, అందులో వారి శిబిరానికి చెందినవి కూడా ఉండటం ఈ ఆర్థిక ధోరణులకు దోహదం చేస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచమంతటా చర్చ జరుగు తున్న సరికొత్త విషయం బ్రిక్స్ పార్లమెంట్ నిజంగా ఏర్పడవచ్చునా అన్నది! 'బ్రిక్స్' గురించి తెలిసిందే. 'బ్రిక్స్' పార్లమెంటరీ ఫోరం మాట విన్నదే. కానీ 'బ్రిక్స్' పార్లమెంట్ కొత్త మాట. పార్లమెంటరీ ఫోరం సమావేశాలు ఈ నెల 11%-%12 తేదీలలో రష్యాలోని సెయింట్ పీటర్స్బర్గ్లో జరిగినప్పుడు, మొదటి రోజున ప్రారంభోపన్యాసం చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, ఉరుములేని పిడుగువలె బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలికి పడింది. ఆయన ఆలో చనలోని ఉద్దేశమేమిటి? 'బ్రిక్స్' దేశాలు అందుకు సమ్మతిస్తాయా? ఆ కొత్త సంస్థ లక్ష్యాలేమిటి? అది యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా? అనే ప్రశ్నలు శరపరంపరగా తలెత్తటం మొదలైంది. ఇది ముఖ్యంగా పాశ్చాత్య దేశాలకు కలవరపాటు కలిగిస్తున్నదనేది గమనించవలసిన విషయం. ఇందుకు సంబంధించి తెలుసుకోవలసిన సమాచారాలు కొన్నున్నాయి. అంతకన్నా ముఖ్యంగా అర్థం చేసుకోవలసిన అంత ర్జాతీయ విషయాలు చాలా ముఖ్యమైనవి కొన్ను న్నాయి. ఇందులో మొదటగా సమాచారాలను చూద్దాం. 'బ్రిక్స్' అనే సంస్థ మొదట 'బ్రిక్' (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) అనే పేరిట 2006లో ఏర్పడింది. తర్వాత 2011లో సౌత్ ఆఫ్రికా చేరికతో 'బ్రిక్స్' అయింది. ఈ సంవత్సరం ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరాయి. తమను కూడా చేర్చుకోవాలంటూ మరొక పాతిక దేశాల వరకు దరఖాస్తు చేసుకున్నాయి. 'బ్రిక్స్' సభ్యదేశాలు 2009లో పార్లమెంటరీ ఫోరంను ఏర్పాటు చేసుకున్నాయి.

### పుతిన్ప్రతిపాదన

ఈ ఫోరం 10వ సమావేశాలు ఈ నెలలో జరిగినపుడే పుతిన్ తన ప్రతిపాదన చేశారు. ఆ సమావేశంలో మన లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. నిజానికి బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం అన్నది సభ్య దేశాల పార్లమెంట్ స్పీకర్ల ఫోరం. అందుకు భిన్నంగా, పుతిన్ ప్రతిపాదన కొత్తగా ఒక ఉమ్మడి పార్లమెంటును ఏర్పాటు చేసుకోవటం. 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశాలు వచ్చే అక్టోబర్లో రష్యాలోని కజాన్ నగరంలో జరగ నున్నాయి. ఈ ప్రతిపాదన అపుడు అధికారికంగా చర్చకు వచ్చి,అందరూ ఆమోదించే పక్షంలో ఆచరణకు వస్తుంది. ఈలోగా ఈ విషయమై ప్రపంచమంతటా చర్చలు సాగుతాయి. మరొకవైపు సభ్య దేశాల మధ్య ముందస్తు సంప్రదింపులు జరగగలవని వేరే చెప్ప నక్కరలేదు.

పోతే, బ్రిక్స లక్ష్యాలే బ్రిక్స్ పార్లమెంటు లక్ష్యాలు, విధులు కాగలవని భావించవచ్చు. బ్రిక్స్ 2006లో ఏర్పడింది. ఎందుకు? ఈ 18 సంవత్సరాలలో ఆ సంస్థ చేసిందేమిటి? అన్నవి మొదట ఉత్పన్న మయే ప్రశ్నలు. ఇది ప్రధానంగా ఆర్థిక, వాణిజ్యపరమైన సంబంధాల కోసం ఏర్పడినటువంటిది. పరస్పర సంబంధాలతో పాటు ఇతర దేశా లతో ఆర్థిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధి కూడా ఈ పరిధిలోకి వస్తుంది. బ్రిక్స్కు రాజకీయపరమైన, సైనికమైన, వ్యూహాత్మకమైన లక్ష్యాలు ఏవీ లేవని, గత 18 సంవత్సరాలుగా అదే ప్రకారం పని చేస్తున్నదనేది గమనించవలసిన విషయం.

### తాజా లెక్కల ప్రకారం...

అంతే గమనించవలసిందేమంటే తన ఆర్థిక లక్ష్యాల ప్రకారం బ్రిక్స్ చాలా సాధించింది. ఉదాహరణకు తాజా లెక్కల ప్రకారం, పాశ్చాత్య దేశాల కూటమి అయిన జీ7 జీడీపీ ప్రపంచంలో 29 శాతం మాత్రమే కాగా, బ్రిక్స్ జీడీపీ 36.8 శాతానికి చేరింది. ఆర్థిక రంగంలో జరుగుతున్నదాని సూచనలను బట్టి చూడగా ఈ వ్యత్యాసం ఇంకా పెరుగుతూ పోగలదన్నది నిపుణుల అంచనా. అది చాల దన్నట్లు మునుముందు సౌదీ అరేబియా, ఇండోనేషియా, మెక్సికో తదితర దేశాలు చేరినపుడు పరిస్థితి ఏమిటో ఊహించవచ్చు. అమె రికా శిబిరానికి బ్రిక్స్ అంటే సరిపడకపోవటానికి ముఖ్యకారణం ఇదే. లోగడ ఆసియాలో ఏషియాన్, ఆఫ్రికాలో ఎకోవాస్, ఇఎసి, లాటిన్ అమెరికాలో సదరన్ కామన్ మార్కెట్ వంటివి ఏర్పడ్డాయి.

ఏషియాన్ గొప్పగా విజయవంతం కాగా తక్కినవి అంతగా కాలేదు. పైగా వాటిలో అమెరికా జోక్యాలు బాగా సాగినందున తమకు పోటీగా మారలేదు. తమను అధిగమించటం అంతకన్నా జరగలేదు. బ్రిక్స్ రికార్డు వీటన్నిటికి భిన్నంగా మారింది. ఆ సంస్థ ఆమెరికా జోక్యానికి సమ్మతించలేదు. ఇండియాతో సహా ఎవరూ ఒత్తిళ్లకు లొంగలేదు. ఇది చాలదన్నట్లు అర్థికాభివృద్ధిలో తమను మించిపోతున్నారు. ఒత్తిళ్లను కాదని ఇదే సంవత్సరం ఈజిప్టు, యూఏఈ వంటివి చేరాయి. ఇరాన్ను చేర్చుకోరాదన్న ఒత్తిడికి బ్రిక్స్ సమ్మతించలేదు. అదే పద్ధతిలో సౌదీ, టర్కీ, ఇండోనేషియా, లిబియా, మెక్సికో వంటివి ముందుకు వస్తున్నాయి. ఈ విధమైన ప్రభావాలను ముందుగానే అంచనా వేసి కావచ్చు అమెరికన్లు, యూరోపియన్లు మొదటినుంచే బ్రిక్స్ను, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివును అడ్డుకునేందుకు, బ్రిక్స్లోని సభ్య దేశాలను ఒత్తిడి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తూ వస్తున్నాయి. రకరకాల ఆంక్షలు ఏదో ఒక సాకుతో విధించటం (ఇండియాపై కూడా), వివిధ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను భంగపరచజూడటం అందులో భాగమే.

భారత, రష్యాల విషయంలోనూ అదే వైఖరి చూపటానికి తాజా ఉదాహరణ ఈ నెల ఎనిమిదిన ప్రధాని మోదీ, పుతిన్ను కలవటంపై ఆగ్రహించటం. అమెరికా శిబిరం ప్రజాస్వామ్యమనీ, ఆసియా దేశాల స్వేచ్ఛ అనీ, అంతర్జాతీయ నియమాలకూ, ఐక్య రాజ్యసమితి ఛార్టర్కూ కట్టుబడటమనీ నీతులు చాలానే చెప్తుంది. కానీ అందుకు విరుద్ధమైన తమ చర్యల గురించి ఎన్ని రోజుల పాటైనా చెప్పవచ్చు.

వీటన్నింటికి విరుగుడుగా తక్కిన ప్రపంచ దేశాలు తీసుకుంటున్న వివిధ చర్యలలో, బ్రిక్స్ పార్లమెంట్ అనే కొత్త ప్రతిపాదన ఒక ముందడుగు కాగల అవకాశం ఉంది. ప్రపంచ దేశాల మధ్య సమా నత్వ ప్రాతిపదికగా పరస్పర సహకారానికి, ఇతోధికాభివృద్ధికి అవస రమైన చర్చలు బ్రిక్స్ పార్లమెంటులో జరగాలన్నది తన ఆలోచన అయినట్లు పుతిన్ చెప్తున్నారు.

– విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో
०91 93916 18181

## బ్రిక్ కరెన్సీ కూడానా?

ప్రపంచంలో 27 దేశాల సభ్యులు ఓ నిర్ణయం తీసుకునేలా ఇప్పటికే యూరోపియన్ యూనియన్ ఉంది. ఉక్రెయిన్పైనా ఈదిశగా ఉందన్నది వాస్తవం. కానీ నాటోవైపు చేరితేనే ఇబ్బంది తప్పదన్నది పుతిన్ ఆలోచన. తన సరిహద్దులలోకి నాటోదళాలు ప్రవేశించడం సహించలేదు. అటు యూరోపియన్ యూనియన్లోని కొన్నిదేశాలు ఉక్రెయిన్ని చేరుకునేందుకు నిరాకరిసస్తున్నాయి.మరోవైపు భారత్, రష్యా, చైనా లతో సహా మరికొందరు ఉండే ఈ బ్రిక్స్ వేదికగా పుతిన్ తయారు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. ఇందులో రష్యా ఆయుద్ధ సంపత్తు, భారత్లో గ్లోబెల్ పవర్గా ఉంది. చైనా జిడిపి లో ప్రధమం. దీంతొ పాటు సౌదీ దేశాలు కూడా చేరితే మరింత పవర్ ఫుల్గా మారుతుందన్నది వాస్తవం. బ్రిక్స్ పార్లమెంటుతోనే ప్రపంచంలో న్యాయబద్ధపాలన అందుతుందని చెపుతున్నారు. గతంలో మన దేశాన్ని పాలించిన పాలకులు ప్రపంచంలో బలపడకుండా చూసే ప్రయత్నం జరుగుతోందని పిస్తోంది. ఈ క్రమంలో ఈ బ్రిక్ పార్టమెంటుకు ప్రత్యేక కరెన్సీ రూపకల్పన కూడా జరుగుతున్నట్టు వార్తలొస్తున్నాయి. దీని వల్ల ఆయా దేశాలలో లావాదేవీలు మరింత సరళతరమవుతాయన్న భావన కూడా వ్యక్తమవుతోంది. మరేం జరగనుందో చూడాలి.



## భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం



రష్యాలోని సెయింట్ పీటర్స్బర్గ్లో గురువారం ప్రారంభమయ్యే రెండు రోజుల 10వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ సమావేశానికి లోక్సభ స్పీకర్ ఓం బిర్లా భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. 'జస్ట్ గ్లోబల్ డెవలప్మెంట్ అండ్ సెక్యూరిటీ కోసం బహుపాక్షికతను బలోపేతం చేయడంలో పార్లమెంటుల పాత్ర' అనే థీమ్తో ఈ ఫోరమ్ జరిగింది. భారత ప్రతినిధి బృందంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాజ్యసభ ఎంపీ శంభు శరణ్ పటేల్, లోక్ సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ, ఇతర అధికారులు కూడా ఉన్నారు. "రష్యాలోని సెయింట్ పీటర్స్బర్గ్లో జరిగిన 10వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్కు ఐపఢని నడిపిస్తున్నాను. బ్రిక్స్ మరియు ఆహ్వానించబడిన దేశాలతో అంతర్-పార్లమెంటరీ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఎదురు చూస్తున్నాను. ఈ పర్యటనలో ఉత్సాహపూరితమైన భారతీయ ప్రవాసులను కలవడానికి మరియు కనెక్ట్ అవ్వడానికి ఆసక్తిగా ఉన్నాను" అని ఓం బిర్లా పోస్ట్ చేసారు .



## ధోనీతో అతడిని పోలుస్తారా? పాక్ జర్నలిస్ట్‌పై హర్భజన్ ఆగ్రహం

పాకిస్థాన్కు చెందిన ఓ జర్నలిస్టు భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. టీమ్ఇండియా దిగ్గజ ఆటగాడితో తమ దేశ క్రికెటర్ను పోల్చడమే దానిక్కారణం. ఇంతకీ ఆ స్టార్ ఎవరంటే? భారత్కు రెండు వరల్డ్ కప్లు అందించిన ఏకైక కెప్టెన్ ఎంఎస్ ధోనీ (గ్రా). పాకిస్థాన్ క్రికెట్లో నాణ్యమైన ఆటగాడిగా పేరొందుతోన్న మహ్మద్ రిజ్వాన్ను ధోనీతో పోలుస్తూ ఆ దేశ జర్నలిస్ట్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడమే వివాదంగా మారింది. వీరిద్దరిలో ఎవరు అత్యుత్తమం? అని ఫొటోకు క్యాప్షన్ జోడించాడు. దీంతో హర్భజన్ కాస్త ఘాటుగానే స్పందించాడు. ప్రపంచ క్రికెట్లో నంబర్వన్ కెప్టెన్గా పేరొందిన ధోనీతో ఎక్కువ అనుభవం లేని ఆటగాడిని పోల్చడం సరైంది కాదని విమర్శించాడు. రిజ్వాన్ బ్యాటింగ్ సత్తాను తక్కువ చేయనని, ధోనీతో సరితూగే ప్లేయర్ మాత్రం కాదని స్పష్టం చేశాడు.

ఈ రోజుల్లోనూ ఇలాంటి చెత్త ప్రశ్నలు అడగడం దారుణం. రిజ్వాన్ కంటే ధోనీ చాలా ముందున్నాడు. ఇందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. నిజాయతీగా సమాధానం ఇవ్వాలి. రిజ్వాన్ ఆటను నేను కూడా ఇష్టపడతా. నిబద్ధతతో ఆడేందుకు ఎల్లవేళలా ప్రయత్నిస్తాడు. అయితే, ధోనీతో రిజ్వాన్ను పోల్చడం తప్పు. ఇప్పటికీ ప్రపంచ క్రికెట్లో అతడే నంబర్ వన్. వికెట్ల వెనుక అత్యంత చురుగ్గా వ్యవహరించిన వికెట్ కీపర్లు చాలా అరుదు. ఆ జాబితాలో ధోనీనే టాప్ అని హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు.వన్డే, టీ20 ప్రపంచ కప్లతోపాటు (20 ) ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా ధోనీ నాయకత్వంలోని భారత్ నిలిచింది. నాలుగేళ్ల కిందటే అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన ధోనీ ఇప్పుడు ఐపీఎల్లోనే ఆడుతున్నాడు. గతేడాది సీజన్ వరకు చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్గా వ్యవహరించాడు. .

# 22న శ్రీలంకకు టీమ్ ఇండియా..



## గంభీర్‌పై బీసీసీఐ అధికారిక ప్రకటన అప్పుడే!

టీమ్ఇండియా ప్రధాన కోచ్గా గౌతమ్ గంభీర్ ప్రకటన తర్వాత ఒక్కసారి కూడా ప్రెస్ కాన్ఫరెన్స్లో పాల్గొనలేదు. బీసీసీఐ కార్యదర్శి జైషా మాత్రమే తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. శ్రీలంక పర్యటన కోసం జట్లను ఎంపిక చేయడంలో గంభీర్ కీలక పాత్ర పోషించాడు. భవిష్యత్తును అంచనా వేస్తూ ఆటగాళ్లను ఎంచుకున్నాడని క్రికెట్ విశ్లేషకుల నుంచి ప్రశంసలూ వచ్చాయి. శ్రీలంక పర్యటన కోసం టీమ్ఇండియా ఆటగాళ్లు జులై 22న స్వదేశం నుంచి పయనమవుతారని తెలుస్తోంది. ఆరోజే బీసీసీఐ ప్రత్యేకంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి గంభీర్కు అధికారికంగా కోచ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటన చేయనుందని సమాచారం. జులై 27 నుంచి ఇరు జట్ల మధ్య మ్యాచ్లు ప్రారంభమవుతాయి. మొదట టీ20 సిరీస్ జరగనుంది. కెప్టెన్గా సూర్యకుమార్ యాదవ్ను బీసీసీఐ నియమించింది. వన్డేలకు మాత్రం ఎప్పటిలానే రోహితే నాయకత్వం వహిస్తాడు.

సూర్యకు శిఖర్ అభినందనలు

టీ20 సారథ్యం సూర్యకుమార్కు దక్కడంపై భారత సీనియర్ క్రికెటర్ శిఖర్ ధావన్ స్పందించాడు. మేనేజ్మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించాడు. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలన్నాడు. కంగ్రాట్స్ సూర్య. నీ కెప్టెన్సీలో టీమ్ఇండియా మరింత ఉన్నత స్థానాలకు వెళ్లాలి. కొత్త సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి. భవిష్యత్తు తరాల క్రికెటర్లకు నీ నాయకత్వం స్ఫూర్తిగా నిలవాలి. ఆల్ ది బెస్ట్ అని పోస్టు పెట్టాడు.

ఇలాంటి రోజు వస్తుందని ఊహించలేదు: దేవిషా శెట్టి

తన భర్త సూర్యకుమార్ యాదవ్ భారత జట్టు కెప్టెన్ కావడంతో దేవిషా శెట్టి ఆనందం వ్యక్తం చేశారు. తన ఇన్స్టాగ్రామ్ స్టోరీస్లో ప్రత్యేకంగా పోస్టు పెట్టారు. నువ్వు భారత జట్టుకు ఆడటం ప్రారంభించినప్పుడు.. ఇలాంటి రోజు (సారథి కావడం) వస్తుందని ఊహించలేదు. ఆ దేవుడి దయ వల్ల నీ కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. నువ్వు సాధించిన దానిపట్ల గర్వంగా ఉంది. ఇప్పుడే ప్రారంభించావు. మున్ముందు మరింత సాధించాలని కోరుకుంటున్నా అని దేవిషా పేర్కొన్నారు.

# ఆ ముగ్గురు ఎందుకు లేరో అర్థం చేసుకోవడం కష్టమే

శ్రీలంక పర్యటనకు భారత జట్టు ఎంపిక జరిగింది. అనూహ్యంగా టీ20లకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ అయ్యాడు. వన్డే, టీ20 సిరీస్లకు వైస్ కెప్టెన్గా శుభమన్ గిల్ వచ్చాడు. ప్రధాన కోచ్గా గౌతమ్ గంభీర్ ఫస్ట్ సిరీస్. వన్డే జట్టు విషయంలో సంజూను పక్కన పెట్టడంపై విమర్శలు వచ్చాయి. అదేవిధంగా పొట్టి ఫార్మాట్కు యుజ్వేంద్ర చాహల్, అభిషేక్ శర్మను తీసుకోకపోవడంపైనా కామెంట్లు వస్తున్నాయి. ఇటీవల జింబాబ్వేపై వారి దేశంలోనే రికార్డు సెంచరీని అభిషేక్ సాధించాడు. అయినా, అతడికి చోటు దక్కలేదు. చాహల్ ప్రపంచకప్ జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్లోనూ ఆడే అవకాశం రాలేదు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు.

టీమ్ఇండియా శ్రీలంక పర్యటన.. టీ20 కెప్టెన్గా సూర్యకుమార్ యాదవ్

చాహల్, అభిషేక్, సంజూ అద్భుతమైన ఆటగాళ్లు. ఈ ముగ్గురికీ చోటు ఎందుకు దక్కలేదో అర్థం చేసుకోవడం చాలా కష్టం అని పోస్టు పెట్టాడు. సంజూకు కనీసం టీ20ల్లోనైనా అవకాశం దక్కింది. మిగతా ఇద్దరు శ్రీలంక పర్యటనకు దూరంగా ఉండాల్సిందే. టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్, విరాట్ విరామం తీసుకుంటారని అంతా భావించారు. అయితే, వన్డే సిరీస్లో ఆడేందుకు అంగీకరించారు. దీంతో హిట్మ్యాన్కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. విరాట్ను సిరీస్కు ఎంపిక చేశారు. కోహ్లి లండన్లో ఉండగా.. రోహిత్ అమెరికాలో కుటుంబంతో హాలీడేస్ ఎంజాయ్ చేస్తున్నారు.

రోహిత్ అస్సలు ఆడడు.. విరాట్తో సవాలే: షమీ

స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికి బౌలింగ్ చేయడం ఎవరికైనా సవాలే. అలాంటి అవకాశం భారత బౌలర్లకు నెట్స్లో లేదా ఐపీఎల్లో మాత్రమే వస్తుంది. సీనియర్ సహచరుడు మహమ్మద్ షమీ కూడా వీరిని ఎదుర్కొన్నవాడే. మరి నెట్స్లో వారికి బౌలింగ్ చేయడం ఎలా ఉంటుందనే ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. నిజం చెప్పాలంటే విరాట్, రోహిత్ నా బౌలింగ్ను నెట్స్లో ఎదుర్కోవడానికి ఇష్టపడరు. ఇప్పటికే ఈ విషయాన్ని చాలా ఇంటర్వ్యూల్లో చెప్పా. విరాట్తో నా స్నేహం ప్రత్యేకమైంది. మేమిద్దరం ఒకరికొకరం సవాళ్లు విసురుకుంటాం. నా బౌలింగ్లో విభిన్నంగా ఆడేందుకు ప్రయత్నిస్తాడు. నేను కూడా అతడిని ఔట్ చేసేందుకు చూసేవాడిని. మా స్నేహం ఇలా ప్రోత్సహించేలా ఉంటుంది. విరాట్, ఇషాంత్ శర్మ కూడా మంచి ఫ్రెండ్స్. ఇక రోహిత్ అస్సలు నా బౌలింగ్లో బ్యాటింగ్ చేయడు. నేరుగా ఆడనని చెప్పేస్తాడు అని షమీ తెలిపాడు.



# టీమ్ ఇండియా మాజీ బ్యాటింగ్ కోచ్‌కు కీలక బాధ్యతలు!

2024 టీ20 ప్రపంచ కప్తో టీమ్ఇండియా ప్రధాన కోచ్గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. ఈ మెగా టోర్నీతోనే పరాస్ మంబ్రే (బౌలింగ్ కోచ్), విక్రమ్ రాథోడ్ (బ్యాటింగ్ కోచ్), ఫీల్డింగ్ కోచ్ (టి దిలీప్)ల పదవీకాలం కూడా పూర్తయింది. కొత్త ప్రధాన కోచ్గా నియమితుడైన గౌతమ్ గంభీర్ సహాయక కోచ్ల ఎంపిక దృష్టిపెట్టాడు.

ఇదిలా ఉండగా.. మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ సేవలను మరో రకంగా వాడుకోవాలని బీసీసీఐ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. విక్రమ్ రాథోడ్ను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ హెడ్గా నియమించాలని యోచనలో ఉన్నట్టు సమాచారం.

ప్రస్తుతం ఎన్సీఏ హెడ్గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ పదవీకాలం ఈ సెప్టెంబరుతో ముగుస్తుంది. అతడిని కాంట్రాక్ట్ను రెన్యువల్ చేసే అవకాశం లేదని సమాచారం. విక్రమ్ రాథోడ్ ఎన్సీఏ హెడ్గా నియమించే అవకాశముంది.

ప్రస్తుతానికి వీవీఎస్ లక్ష్మణ్ కాంట్రాక్ట్ పునరుద్ధరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మరోసారి ఈ పదవిలో కొనసాగడానికి లక్ష్మణ్ పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

విక్రమ్ రాథోడ్ను జాతీయ క్రికెట్ అకాడమీ బాధ్యతలు స్వీకరించాలని కోరే ఛాన్స్ ఉంది.

ప్రస్తుతం బీసీసీఐ కార్యదర్శి జై షా ఐసీసీ వార్షిక సమావేశం కోసం కొలంబో వెళ్లారు. జై షా భారత్కు వచ్చిన తర్వాత వీవీఎస్ లక్ష్మణ్తో మాట్లాడి అతడి అభిప్రాయం తెలుసుకుంటారు అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.



# దమ్ముంటే అసలైన ఖాతాల నుంచి పోస్టు పెట్టండి



- తీవ్రంగా స్పందించిన షమీ
- సానియాతో పెళ్లి రూమర్లపై క్లారిటీ ఇచ్చిన షమీ

ఢిల్లీః సానియాతో పెళ్లి వార్తలపై మహమ్మద్ షమీ తీవ్రంగా స్పందించాడు. ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేసే ముందు ఆలోచించుకోవాలని హెచ్చరించాడు. టెన్నిస్ స్టార్ సానియా మీర్జాతో తన పెళ్లి జరుగుతుందంటూ వచ్చిన రూమర్లపై మరోసారి మహమ్మద్ షమీ తీవ్రంగా స్పందించాడు. వీరిద్దరి ఫొటోలను షేర్ చేస్తూ కొందరు నెట్టింట తప్పుడు వార్తలను సృష్టించారు. గతంలోనే షమీ వాటిని కొట్టిపడేశాడు. సానియా తండ్రి కూడా అవన్నీ రూమర్లేనని ఖండించాడు. అయినా, సరే అలాంటి వార్తలు ఇంకా వ్యాప్తి చెందుతూనే ఉన్నాయి. దీంతో తాజాగా ఓ ఇంటర్వ్యూలో షమీ దీనిపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఆన్లైన్ వేదికగా ఇలాంటి వార్తలను షేర్ చేసేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించాడు. కొందరు మీమ్స్ను సరదాగా ఉంటాయని చేస్తున్నారని.. కానీ, అవి చాలామందిని బాధకు గురి చేస్తాయని పేర్కొన్నాడు.

ఇలాంటి అసత్య వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేసేవారికి నాదొక హెచ్చరిక. మీరు చేసే మీమ్స్ వల్ల చాలామంది బాధ పడతారు. కొందరిని లక్ష్యంగా చేసుకొని కూడా ఇలాంటివి సిద్ధం చేస్తున్నారు. అలా చేయడం వల్ల ఏం వస్తుంది? నేను ఫోన్ ఓపెన్ చేస్తే చాలు ఇవే కనబడుతున్నాయి. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఏదైనా వార్తను షేర్ చేయాల్సినప్పుడు కరెక్టా? కదా? అనేది ధ్రువీకరించుకోవాలి. ఒకవేళ తప్పుడు ప్రచారం చేయాలనుకుంటే మీ అసలైన (వెరిఫైడ్) ఖాతాల నుంచి పోస్టు చేయండి. అప్పుడు నేను సరైన సమాధానం ఇస్తా. జీవితంలో విజయం సాధించడానికి ప్రయత్నించండి. ఇతరులకు సాయం చేయండి. ఉన్నతస్థాయికి వెళ్లేందుకు కృషి చేయండి. అప్పుడే మీరు మంచి వ్యక్తి అని ఇతరులు భావిస్తారు. అలాంటివన్నీ వదిలేసి ఇలాంటి చెత్త న్యూస్లను ప్రచారం చేయడం సరైంది కాదు అని షమీ తెలిపాడు.

# ముగిసిన మాన్సూన్ రెగట్టా.. గోవర్ధన్ ట్రిపుల్ ధమాకా

హైదరాబాద్: 15వ మాన్సూన్ రెగట్టా విజయవంతంగా ముగిసింది. చివరి రోజు, శనివారం హుస్సేన్సాగర్లో చినుకుల మధ్య సెయిలర్లు పోటీపడ్డారు. ఊహించినట్లుగానే తెలంగాణకు చెందిన గోవర్ధన్ పల్లార, దీక్షిత కొమరవెల్లి చివరి రేసులో సునాయాసంగా దూసుకెళ్లి అండర్ 16 ఆప్టిమిస్ట్ బాలుర, బాలికల బంగారు పతకాలు, ట్రోఫీలు సొంతం చేసుకున్నారు. అండర్ 16 ఆప్టిమిస్ట్ బాలురు విభాగంలో గోవర్ధన్ పల్లారా మాన్సూన్ రెగట్టా ట్రోఫీని, అత్యంత నిలకడైన సెయిలర్గా ఎస్వెచ్ బాబు ట్రోఫీని, బాలుర బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. దాంతో మాన్సూన్ రెగట్టాలో అరుదైన ట్రిపుల్ ధమాకా సాధించాడు. అండర్–16లో ఇది నా చివరి సంవత్సరం. ఈ ఏడాది డిసెంబర్లోపు భారతదేశానికి కొన్ని అంతర్జాతీయ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తున్నాఅని గోవర్ధన్ చెప్పాడు. బాలుర విభాగంలో మైరూర్కు చెందిన ఆకాష్ తంగై, తెలంగాణకు చెందిన రిజ్వాన్ మహ్మద్ వరుసగా రజతం, కాంస్యం గెలుచుకోగా, బాలికల్లో తమిళనాడుకు చెందిన శ్రేయా కృష్ణ రతజం, మధ్యప్రదేశ్కు చెందిన షగున్ ఝా కాంస్యం సాధించారు. కాగా, అండర్18 విభాగంలో ఉత్తమ సింగిల్ హ్యాండర్ ఐఎల్సీఏ 4 బాలికల ట్రోఫీని ఒడిశాకు చెందిన అలియా సబ్రీన్ గెలుచుకోగా, బాలుర ట్రోఫీని మధ్యప్రదేశ్కు చెందిన అక్షత్ దోహ్రే కైవసం చేసుకున్నాడు. 29 యిఆర్ అండర్18 ఉత్తమ డబుల్ హ్యాండర్ ట్రోఫీని టీఎస్సీ మైసూర్కు చెందిన నిఖిల్ మాండవ్కర్ సత్యం ఝా ద్వయం గెలిచారు. 420 అంతర్జాతీయ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన తనుజా కామేశ్వర్ గణేష్ పీర్కట్ల, మధ్యప్రదేశ్ సెయిలర్లు దివయాన్షి మిశ్రా అనిరాజ్ తొలి రెండు స్థానాలతో స్వర్ణం, రజతం అందుకున్నారు.



### గ్రహాంతరవాసులు ఉన్నారని

## విరాట్ కోహ్లి నమ్ముతాడు



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి భారత క్రికెట్లోనే కాక ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడు. దిగ్గజాలు నెలకొల్పిన రికార్డులను సైతం బ్రేక్ చేసి కొత్త రికార్డులు సృష్టించాడు. ఇప్పటికీ అతడి పరుగుల వరద కొనసాగుతూనే ఉంది. అందుకే అతడిని అభిమానులు ముద్దుగా కింగ్ కోహ్లి అని పిలుస్తుంటారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఎంతో పాపులారిటీ సంపాదించుకున్న కోహ్లి గురించి ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని భారత మాజీ వికెట్కీపర్ దినేశ్ కార్తిక్ బయటపెట్టాడు. విరాట్ గ్రహాంతరవాసులపై ఆసక్తి చూపిస్తాడని డీకే వెల్లడించాడు.

నాకు గ్రహాంతరవాసులంటే నమ్మకం లేదు. నిజానికి ఈ విషయం గురించి నాకు అంతగా అవగాహన లేదు. అయితే ఏలియన్స్ అంటే ఎవరికి ఆసక్తి ఉంటుంది. దీనిగురించి చాలా విషయాలు తెలిసిన వ్యక్తి ఎవరో చెబితే మీరు ఆశ్చర్యపోతారు. అతనెవరో కాదు విరాట్ కోహ్లి. అమెరికాలో లేదా నెవాడా (అమెరికాలో ఒక రాష్ట్రం)లో ఏదో ఒక ప్రాంతంలో కనిపించిన గ్రహాంతరవాసుల గురించి కోహ్లి నాకు యూట్యూబ్ వీడియోను చూపించినట్లు గుర్తుంది. ఆ ప్రాంతం పేరు మర్చిపోయాను. నేను ఏలియన్స్ గురించి అంతగా పట్టించుకోను. కానీ, కోహ్లికి ఈవిషయంపై చాలా ఆసక్తి ఉందని నాకు తెలుసు అని దినేశ్ కార్తిక్ అన్నాడు.

విరాట్ కోహ్లి, దినేశ్ కార్తిక్ చాలాకాలంపాటు ఐపీఎల్లో ఆర్సీబీ తరఫున కలిసి ఆడారు. వీరి మధ్య మంచి ఫ్రెండ్షిప్ ఉంది. 2024 ఐపీఎల్ సీజన్లో బెంగళూరు ఎలిమినేటర్ మ్యాచ్లో రాజస్థాన్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ మ్యాచ్ అయిన వెంటనే కార్తిక్ ఐపీఎల్ రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. వచ్చే ఐపీఎల్ సీజన్ (2025) నుంచి బెంగళూరుకు దినేశ్ కార్తిక్ బ్యాటింగ్ కోచ్, మెంటార్గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే.

### విమర్శల నుంచి ప్రశంసలు..

## ఈ వరల్డ్ కప్ నాకెంతో ప్రత్యేకం



టీ20 ప్రపంచకప్ (20 2024) కోసం జట్టును ప్రకటించినప్పుడు ఓ యువ బౌలర్ను బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు. అతడిని బ్యాకప్గా ఉంచుకోవడానికేనని అంతా భావించారు. కానీ, సీనియర్ సిరాజ్ను పక్కనపెట్టి మరీ అన్ని మ్యాచుల్లో కుర్రాడు అర్ష్దీప్కే కెప్టెన్ రోహిత్ శర్మ అవకాశం కల్పించాడు. అందుకు తగ్గట్టుగానే అత్యుత్తమ ప్రదర్శనతో చెలరేగిపోయాడు. ఓవైపు బుమ్రాను కాచుకోవడానికి ప్రత్యర్థులు ప్రయత్నిస్తుంటే.. మరోవైపు అర్ష్దీప్ మాత్రం చడీచప్పుడు లేకుండా వికెట్లు పడగొట్టేశాడు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్గా నిలిచాడు. భారత్ విజేతగా నిలవడంతో అతడిపైనా ప్రశంసల జల్లు కురిసింది. కానీ, పొట్టి కప్ 2022లో పాకిస్థాన్తో జరిగిన మ్యాచ్లో క్యాచ్ను జారవిడవడంతో అతడిపై తీవ్ర స్థాయిలో విమర్శలూ రేగాయి. ఒక దశలో క్రికెట్కు పనికిరాడంటూ కామెంట్లను ఎదుర్కొన్నాడు. ఇప్పుడు వారి నుంచే అభినందనలు వస్తుంటే చాలా ఆనందంగా ఉందని అర్ష్దీప్ సింగ్ వెల్లడించాడు.

ఈ వరల్డ్ కప్ చిరస్మరణీయం. అభిమానుల నుంచి వస్తున్న ప్రశంసలకు కృతజ్ఞతలు చెబుతున్నా. వ్యక్తిగతంగానూ పొట్టి కప్లో నా ప్రదర్శనపై చాలా ఆనందంగా ఉంది. ఇదే అత్యుత్తమం అని ఎప్పుడూ భావించను. నిరంతరం నేర్చుకొనేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా. జట్టు విజయం కోసం కష్టపడుతూనే ఉంటాను. అందులో ఎలాంటి రాజీ ఉండదు. క్రికెట్ ప్రయాణంలో ప్రతీ ఆటగాడికి విమర్శలు, క్లిష్ట పరిస్థితులు సర్వసాధారణం. వాటి నుంచి కూడా పాఠాలు నేర్చుకొని స్థాయిని పెంచుకోవడానికి ప్రయత్నించాలి. దేశం కోసం ఆడుతున్నప్పుడు ఎప్పుడూ విమర్శలు పట్టించుకోకూడదు. లేకపోతే ఏకాగ్రత కోల్పోయే ప్రమాదం ఉంది. జట్టులోని సహచరులే కాకుండా కుటుంబసభ్యులూ నాకెప్పుడూ మద్దతుగా నిలిచారు అని చెప్పాడు.

రోహిత్ కెప్టెన్సీపై..

రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఆడటం ఎప్పుడూ మంచి అనుభవమే. ప్రతి బౌలర్కు పూర్తి స్వేచ్ఛ ఇస్తాడు. మైదానంలో మేం ఎలా బౌలింగ్ వేయాలనేది మాకే వదిలేస్తాడు. ఫీల్డింగ్ సెటప్ విషయంలోనే సూచనలు చేస్తాడు. నిశ్శబ్దంగా ఉంటూనే ప్రత్యర్థి ప్లేయర్లను కట్టడి చేసేందుకు అద్భుతమైన వ్యూహాలు ఎంచుకుంటాడు. తీవ్ర ఒత్తిడి సమయంలోనూ సంయమనం కోల్పోకుండా నిబ్బరంగా ఉంటాడు. ఎప్పుడూ జట్టులో సానుకూల దృక్పథం ఉండేలా చూస్తాడు. బ్యాటింగ్లోనూ దూకుడుగా ఉంటూ సహచర క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తాడు అని వ్యాఖ్యానించాడు.

టీ20ల్లో వారిద్దరిది ఓ మార్క్..

టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పొట్టి ఫార్మాట్కు వీడ్కోలు పలికేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. టీ20ల్లో వీరిద్దరూ ఓ మార్కు వదిలిపెట్టి వెళ్లారు. కొత్త తరాలకు వీరి ఆట స్ఫూర్తిగా నిలుస్తుంది. నిబద్ధత, అభిరుచి, ఒత్తిడిలోనూ నిలకడైన ఆటతీరు ప్రదర్శించిన రోహిత్, కోహ్లి ఎప్పటికీ మాలాంటి కుర్రాళ్లకు మార్గదర్శకులే అని అర్షదీప్ తెలిపాడు. టీ20 ఫార్మాట్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో రోహిత్ (4,231) అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లి (4,188) తర్వాత నిలిచాడు.

